ప్రజాశక్తి
విశాఖ
సోమవారం
జనవరి 1,
2018

ప్రజాస్వామ్యం అపహాస్యం : బొత్స

వార్త 2లో..



నూతనోత్సాహం



క్యాట్ వాక్ చేస్తున్న యువతి

2018కి స్వాగతం పలుకుతూ యువత కేరింత

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలో కొత్త సంవత్సర వేడుకలు అంబరాన్ని అంటాయి. డిసెంబరు 31 ఆదివారం కావడంతో

మిగతా 4లో..

ట్రెక్కింగ్‌లో అపశృతి

వార్త 2లో..

చేనేత హస్త కళా మేళా ప్రారంభం

వార్త 5లో..



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న 'గీతం' వలంటీర్లు

తెన్నేటి పార్కులో 'గీతం' స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-విశాఖపట్నం

తెన్నేటిపార్కులో గీతం స్కూల్ ఆఫ్ లాకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ ఎం.పోతరాజు మాట్లాడుతూ, 2017కు వీడ్కోలు పలుకుతూ తమ విద్యార్థులు ఆదివారం స్వచ్ఛభారత్ చేపట్టారని తెలిపారు. హుదూద్ తుపాను తర్వాత తెన్నేటి పార్కును గీతం దత్తత తీసుకుందని, బీచ్ క్లీనింగ్, ప్రపంచ యోగా, పర్యావరణ దినోత్సవాలను పార్కులో నిర్వహించామని తెలిపారు. దశల వారీగా 1500 మంది వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు క్రమం తప్పకుండా దశల వారీగా ప్రతి ఆదివారం స్వచ్ఛభారత్ చేపట్టారని పేర్కొన్నారు. ఇకముందు కూడా ఇదేస్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ వై.సత్యనారాయణ, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ శివానందకుమార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ వీరేశ్వరస్వామి పాల్గొన్నారు.

నేటి 'మీ కోసం ప్రజావాణి' రద్దు

జిల్లాపరిషత్ : కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదులు స్వీకరించేందుకు సోమవారం నిర్వహించనున్న మీకోసం ప్రజావాణి, డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాలను రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుండి జన్మభూమి మా ఊరు కార్యక్రమం ఉన్నందున మండల అధికారులతో సమీక్షించాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కారణంగా జనవరి 1న ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమం రద్దు చేశామని, దీనిని ప్రజలు గమనించాలని కోరారు.

ఖాళీల కలత

ప్రభుత్వాస్పత్రుల్లో భర్తీ కాని పోస్టులు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ప్రభుత్వం ఎన్ని మాటలు చెబుతున్నా ప్రభుత్వాస్పత్రుల్లో వివిధ స్థాయిల్లో సేవలందించాల్సిన ఖాళీలను భర్తీ చేయడం లేదు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రాథమిక, ఉప కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రుల్లో ఖాళీలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ఖాళీలను భర్తీ చేసి మెరుగైన వైద్యసేవలందిస్తామని ప్రకటనలకు ఆచరణకు పొంతన ఉండడం లేదు. ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల తాకిడి పెరుగుతున్నా ఆ మేరకు వాటిని ప్రభుత్వం అభివృద్ధి చేసి మెరుగైన వైద్య సేవల కల్పనకు ప్రయత్నం చేయడం లేదు. ఇప్పటికీ 527 పోస్టులు ఖాళీగా వున్నాయి.

జిల్లాలో 89 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 584 ఉప ఆరోగ్య కేంద్రాలు, 13 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక ఏరియా ఆస్పత్రి, ఒక జిల్లా ఆస్పత్రి, ఒక మెడికల్ కాలేజీ ఆస్పత్రి ఉన్నాయి. వీటిల్లో వివిధ స్థాయిల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ఉప ఆరోగ్య కేంద్రాల్లో మొదలుకొని జిల్లా ఆస్పత్రుల వరకు ఖాళీలు దర్శనమిస్తున్నాయి.

జిల్లాలో రెండు సివిల్ సర్జన్, ఆరు సివిల్ సర్జన్ (స్పెషలిస్టులు), నాలుగు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (మెడికల్ ఆఫీసర్లు), ఐదు పబ్లిక్‌హెల్త్ నర్సులు, 15 మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు, ఎనిమిది స్టాఫ్‌నర్సులు, 18 మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు(మగ), ఆరు మల్టీ పర్పస్ హెల్త్ సూపర్‌వైజర్లు (ఆడ), 13 ల్యాబ్ టెక్నీషియన్లు, 11 ఫార్మాసిస్టులు, 159 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (మగ), 155 మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లు (ఆడ), 125 సెకెండ్ ఎఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెరుగైన వైద్యసేవలందించాల్సిన వైద్య నిపుణుల నుంచి క్షేత్రస్థాయిలో రోగులకు సేవలందించగలిగే ఎఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్లు పోస్టుల వరకు ఎంతో కాలంగా ఖాళీగా ఉంటున్నాయి.

అలాగే 584 ఉప కేంద్రాల్లో 226 కేంద్రాలకు ప్రభుత్వ భవనాలున్నాయి. ఇంకా 358 ఉప ఆరోగ్య కేంద్రాలు ప్రయివేటు భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రజలకు అందుబాటులో ఉండే ఈ కేంద్రాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టి ప్రాథమిక వైద్య సౌకర్యాల కల్పనకు సరిపడా మౌలిక సదుపాయాలు సమకూర్చడం లేదు. దీంతో ప్రభుత్వాసుపత్రిలో వైద్య సదుపాయాలు మెరుగుపడకపోవడంతో పేదలకు సరైన వైద్యం అందడం లేదు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

2017లో విశాఖ భూ కబ్జాలు రాష్ట్ర వ్యాప్త సంచలనం

పోలీసులంటే భయం పోవడం వల్లే నేరాలు పెరుగుదల

వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యం అపహాస్యమైందని వైసిపి సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ ఆరోపించారు. జగదాంబ కూడలిలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2017లో విశాఖలో భూ కబ్జాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయన్నారు. వీటిని కప్పిపుచ్చుకోవడానికి ఎన్ని విశాఖ ఉత్సవ్‌లను నిర్వహించినా విశాఖ ఇమేజ్ పెరగదని స్పష్టం చేశారు. సిట్ దర్యాప్తు ముగిసినట్లు పత్రికల్లో వచ్చిందని కచ్చితంగా దర్యాప్తులో ఉన్న నిందితుల పేర్లను బహిర్గతం చేసి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ఈ నివేదికను ప్రభుత్వం ముందు పెడితే నిందితులన బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేసే నాయకులు తెలుగుదేశం పార్టీలో ఉన్నారన్నారు. అటువంటి వారికి అవకాశం ఇవ్వకుండా సిట్ నివేదికను విశాఖలో బహిర్గతం చేయాలని కోరారు. 2018లోనైనా ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసి మంచి పాలనను అందించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు పత్రికలు కూడా ప్రజా స్వామ్యాన్ని కాపాడటంతో కీలక పాత్ర పోషించాలన్నారు. ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం లాలూచీ పడటంతోనే ప్రత్యేక ప్యాకేజీను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారనీ, ప్రత్యేక హోదా కోసం నిరంతర పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ముఖ్యంగా విశాఖకు రైల్వే జోన్ చిరకాల వాంఛన్నారు. కచ్చితంగా జోన్ సాధనకు పోరాటం చేస్తామని చెప్పారు. ఇటీవల ఢిల్లీలో రైల్వే శాఖ మంత్రిని వైసిపి ఎంపీలు కలిసి విశాఖ జోన్ గురించి చర్చించారన్నారు. కాగా ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రంలో తొలిసారి ప్రతి పక్షం లేకుండా శాసన సభను నిర్వహించడం దురదృష్టమన్నారు. తమ డిమాండ్స్ పరిష్కరించే వరకూ అసెంబ్లీలో తమ ఎమ్మెల్యేలు అడుగు పెట్టరని స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ 22 మంది తమ పార్టీ ఎమ్మెల్యేలను టిడిపి ప్రభుత్వం మోసపూరితంగా ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో నలుగురికి మంత్రి పదవులు కట్టబెట్టడం బాధాకరమని పేర్కొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ

పోలీసులను కూడా చేతిలో పెట్టుకుని చట్టాన్ని ఇష్టానుసారంగా మార్చేస్తున్నారని ఆరోపించారు. దీంతో పోలీసులంటే భయం పోవడం వల్లే నగరంలో హత్యలు పెరిగిపోయాయన్నారు. సాయంత్రం పూట వేలాది మంది తిరిగే ద్వారకా బస్సు స్టేషన్ సమీపంలో ఒక యువకునిపై హత్యాయత్నమే దీనికి తార్కాణమని పేర్కొన్నారు. కేటాయించిన నిధులు ఖర్చుపెట్టకుండా మింగేస్తున్న ప్రభుత్వాన్ని నిలదీసిన దళితులపై దాడులు అమానుషమన్నారు. ముఖ్యంగా పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలో దళిత మహిళను వివస్త్రను చేసి దాడి చేయడం సిగ్గుచేటన్నారు. నూతన సంవత్సరంలోనైనా ఇటువంటి దారుణాలకు ఒడిగట్టకుండా పాలించాలని కోరారు. రాష్ట్రానికి పోలవరం జీవననాడనీ, దీన్ని 2004లో కీర్తిశేషులు వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించారనీ అటువంటి ప్రాజెక్టును తానే ప్రారంభించానని, తన జీవితాశయం ఆ ప్రాజెక్టు అని చంద్రబాబు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రాజెక్టు గుత్తేదార్లతో కుమ్మక్కై నిధులు దోచుకుంటున్నారని ఆరోపించారు. టిడిపి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇంత వరకూ ఒక్క నూతన ప్రాజెక్టును కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. అనంతరం అందరికీ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి అనకాపల్లి పార్లమెంటు అధ్యక్షులు గుడివాడ అమర్‌నాథ్, విశాఖపట్నం పార్లమెంటు అధ్యక్షులు తైనాల విజయ్‌కుమార్, నాయకులు కరణం ధర్మశ్రీ, వి.కళ్యాణి, తిప్పల నాగిరెడ్డి, కోల గురువులు, గరికిన గౌరి, పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్‌లో అపశృతి

కొండెక్కిన ఆరుగురు యువకులు మిస్సింగ్

రెండు హెలికాప్టర్లతో గాలించి పట్టుకున్న నేవీ

ఊపిరిపీల్చుకున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నగరంలోని సీతమ్మధార సమీపంలోని సింహాచలం కొండ పైకి ట్రెక్కింగ్ నిమిత్తం సుమారు 20 మంది యువకులు వెళ్లారు. ఇందులో 14 మంది తిరిగి కిందకు వచ్చేయగా మిగిలిన ఆరుగురు దారి తప్పిపోయారు. దీంతో వారు మిగిలిన స్నేహితులకు ఫోన్‌చేశారు. తాము దారితప్పిపోయామని ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని సమాచారమిచ్చారు. అప్పటికే కిందికి వచ్చేసిన స్నేహితులు ఈ సమాచారాన్ని పోలీసులకు అందించారు. డిసిపి ఫకీరప్ప ఆధ్వర్యాన పోలీసులు నేవీ అధికారుల సహకారంతో హెలికాప్టర్‌పై గాలించారు. వారితో పాటు వుడా వీసీ పట్నాల బసంత్‌కుమార్ కూడా హెలీటూరిజానికి కేటాయించిన పవన్ హెన్స్ హెలికాప్టర్‌పై సింహాచలం కొండను గాలించారు. చివరికి ఆరుగురు యువకులను గుర్తించి సురక్షితంగా కిందకు దించారు. దీంతో పోలీసులు, నేవీ, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.


ట్రెక్కింగ్‌లో తప్పిపోయిన యువకులను పట్టుకున్న నేవీ సిబ్బంది

ఉద్యమ బలోపేతంతోనే మోసాలకు కళ్లెం : ప్రత్తిపాటి

ప్రజాశక్తి-విశాఖపట్నం

వినియోగదారుల ఉద్యమ బలోపేతంతోనే మోసాలకు కళ్లెం వేయవచ్చుని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సర్క్యూట్ హౌస్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన వినియోగదారుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారుల హక్కుల రక్షణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. చైతన్యం, అవగాహనతో వినియోగదారుల హక్కులు పరిరక్షించబడతాయని చెప్పారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు రశీదు తీసుకోవాలని సూచించారు. వస్తు సేవల్లో నష్టపోయిన వినియోగదారులు 'ఫోరం'లో కేసు వేసేందుకు న్యాయవాది అక్కర్లేదన్నారు. వినియోగదారులు హక్కులతోపాటు బాధ్యతలను కూడా గుర్తించాలని కోరారు. డిస్కౌంట్ మోజులో నాణ్యత మరువొద్దని, ప్రకటనల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వినియోగదారుల హక్కుల రక్షణకు సంబంధించి జిల్లా, మండల


మాట్లాడుతున్న మంత్రి ప్రతిపాటి పుల్లారావు

వినియోగదారుల సమాచార కేంద్రాలు, వినియోగదారుల క్లబ్‌లు, ధరల నియంత్రణ, విజిలెన్స్ కమిటీలను తక్షణం నియమించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సృజనను మంత్రి పుల్లారావు ఆదేశించారు. కొనుగోలుకు ముందు వస్తువుల తయారీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. హక్కులపై అవగాహన ఉంటే సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చని చెప్పారు. జిల్లా కేంద్రంలోనే ఉన్న రెండు జిల్లా వినియోగదారుల ఫోరాల్లో ఒకదానిని గ్రామీణ జిల్లాకు తరలించే యోచనను పరిశీలిస్తామన్నారు. త్వరలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో వినియోగదారుల సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ, సినిమా థియేటర్లు, తూనికలు, కొలతల శాఖ, బీఐఎస్, వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించి నెలకొన్న సమస్యలను ఏకరవు పెట్టారు. అనంతరం వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, కేసు వేయు విధానం గురించి 'మేలుకో ... వినియోగదారుడా మేలుకో' పేరుతో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ముద్రించిన బ్రోచర్‌ను మంత్రి పుల్లారావు విడుదల చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మధురవాడ

జివిఎంసి 4, 5, 6 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాలను, ప్రారంభోత్సవాలు రాష్ట్ర మానవ వనరులు శాఖ మాంత్రి గంటా శ్రీనివాసరావు నిర్వహించారు. ఆదివారం ఉదయం మందుగా 5వ వార్డులలో గల మిధిలీపురం కాలనీలో రూ. 41 లక్షల వ్యయంతో చేపడుతున్న పార్కు నిర్మాణ పనులు శంకుస్థాపను చేశారు. వికలాంగుల కాలనీ సంబధించి లబ్దిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. మధురవాడ పరిధిలో 4వ వార్డులో గల జాతర వద్ద రూ.94.46 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. అనంతరం 4వ వార్డు రిక్షా కాలనీలో రూ. 28.40 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాం సంక్షేమ పథకాలకు పెద్ద పీట వేసిందన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత విశాఖపట్నం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదన్నారు. అందులో భాగంగా మధురవాడ 4, 5, 6 వార్డులు మరింత అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఈ మూడున్నర సంవత్సరాల కాలంలో ఈ మూడు వార్డులో కోట్ల రూపాలయలు విలువ చేసే 577 పనులను చేశామన్నారు. మరిన్ని పనులచ అభివృద్ధి కొరకు రూ. 12 కోట్లు మంజూరు చేశామన్నారు. జనవరి2 నుండి 11 వరకు జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఒక్కొక్కరోజు ఒక్కొక్క అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకున్నామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని సత్వర సరిష్కారానికి కృషిచేస్తున్నామని వివరించారు. అనంతరం మంత్రి 33,954 మందికి చంద్రన్న బీమా బాండ్లును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ హరినారాయణన్, జోన్ కమిషనర్ సత్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా బాండ్లను అందిస్తున్న మంత్రి గంటా

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు రేవతి





రేవతిని అభినందిస్తున్న శ్రీనివాసరావు, బహుమతులతో రేవతి

ప్రజాశక్తి-భీమునిపట్నం

స్థానిక సన్‌స్కూల్ విద్యార్థిని కొయ్య రేవతి జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఈమె ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. విశాఖ జిల్లా తరపున గోల్ షూటర్‌గా, 10 గోల్స్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. 2018 జనవరి 3వ తేదీన ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన రేవతిని సన్‌స్కూల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు ఆదివారం పాఠశాలలో అభినందించారు. ఇటీ వల విజయవాడ-ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో అండర్ 19 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రేవతి నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. 2017 నవంబర్ 26, డిసెంబర్ 27 తేదీల్లో కృష్ణాజిల్లాలో ఎపి నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలోజరిగిన పోటీల్లో ఈమె పాల్గొని ప్రతిభ కనభరిచినట్లు పేర్కొన్నారు. ఈమెను అభినందించిన వారిలో సన్‌స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావుతోపాటు కోచ్ అరుణ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

చికెన్ ధరలు

బాయిలర్ (బ్యాగ్) లైవ్	రూ. 98.00
విత్ స్కిన్	రూ.166.00
స్కిన్ లెస్	రూ.176.00
కోడిగుడ్లు (100 గుడ్లు)	రూ.366.00

అత్యవసర సమాచారం

కింగ్ జార్జ్ ఆసుపత్రి	- 2564891
విక్టోరియా ఆసుపత్రి	- 2562637
మెంటల్ ఆసుపత్రి	- 2754918
ఎఎస్ రాజా రక్తనిధి కేంద్రం	- 2543436
పోలీస్ కంట్రోల్ రూమ్	- 100, 2565454
క్రైమ్ స్టాపర్	-1090
ఆర్టీసీ	- 2746400
తాగునీటి ఫిర్యాదులు	- 2517261
ఫైర్	- 101
రైల్వే రిజర్వేషన్ ఎంక్వైరీ	- 135
వంట గ్యాస్	- 2578158
విద్యుత్ సమాచారం	- 2718091
ఇండియన్ ఎయిర్ లైన్స్	- 2746501
జెట్ ఎయిర్ వేస్	- 23401222
సహారా ఎయిర్‌లైన్స్	- 5572333
ఎయిర్ డెక్కన్	- 2543352
ఎయిర్ పోర్టు	- 2757263

నూతన సంవత్సరానికి పలువురి శుభాకాంక్షలు

నవ వసంతం.. సంకల్పం

నవ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లాకు ఉజ్వల భవిష్యత్తును ఆక్షాంకిస్తూ.. నేతలు, అధికారులు తమ అభిమతాలను ఇలా వెలిబుచ్చారు. ప్రజలకు మంచి జరగాలని అభిలాషించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

నూతన సంవత్సరంలోనైనా ప్రజా సమస్యలను పరిష్కరిం చాలి. నిర్వాసితులు, రైతులు, కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలి. ప్రపంచీకరణలో భాగంగా అంతా ఒకటి కావాలని కోరుకుంటూ ప్రపంచ పండగను వ్యతిరేకించడం సరికాదు. ప్రపంచమంతా సంబరాలు జరుపుకుంటున్నప్పుడు దీన్ని మనం చేసుకోరాదు అంటే ఎటు వెళ్తున్నట్లు సంకుచిత బావాలవైపా? నూతన సంవత్సరం చేసుకోవద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమే. ఇది దుర్మార్గం.



కె.లోకనాథం,
జిల్లా కార్యదర్శి, సిపిఎం

మహిళలు మరింత ఐక్యం కావాలి

2018 నూతన సంవత్సరం సందర్భంగా విశాఖ ప్రజానీకానికి ఐద్వా నగర కమిటీ హార్థిక శుభాకాంక్షలు తెలియచేస్తోంది. రాబోయే కాలంలో ప్రజా సంక్షేమం కోసం, అవనిలో సగమై అన్ని రంగాలలో తమ సత్తా చాటుకుంటూ, ఉత్పత్తి లో కీలక పాత్ర పోషిస్తున్న మహిళల అభివృద్ధి కోసం అందరం మరింత ఐక్యమై కృషి చేయాలని ఐద్వా పిలుపునిస్తోంది.



**ఆర్ఎన్.మాధవి,
ఐద్వా
నగర కార్యదర్శి**

నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలి. అందరికీ 2018 నూతన సంవత్సర శుభాకాంక్షలు.



ప్రవీణ్‌కుమార్, కలెక్టర్

స్వాగతం పలుకుదాం

గత సంవత్సరం జ్ఞాపకాలను నెమరువేస్తూ, కొత్త ఆశలకు ఊపిరిపోస్తూ, ఉప్పొంగిన ఉత్సాహంతో.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.



**- గంటా శ్రీనివాసరావు,
రాష్ట్ర మానవ వనరుల
శాఖామాత్యులు**

విలువైన జీవితాన్ని సార్థకం చేసుకోవాలి

పోలీసుల జీవితం చాలా విలువైనది. చిన్న సమస్యలకు ఆత్మహత్యలు చేసుకోకుండా సమస్యకు పరిష్కారం చూసుకోవాలి. పెద్దలతో మాట్లాడి సమస్య నుంచి బయటపడాలి. తాగి డ్రైవింగ్ చేయకూడదు. ప్రమాదాల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యార్థులు వార్షిక లక్ష్యాన్ని పెట్టుకొని చదవాలి. చెడు అలవాట్లకు లోనుకాకుండా చదువుకొని ఉపాధి పొందాలి. పాత కక్షలు మానుకొని కలిసి బతికి ఒకరికొకరు సహాయపడాలి. పోలీసులు పరంగా మరింత స్నేహంగా వ్యవహరిస్తాం. ప్రజలకు చేరువవుతాం.

-రాహుల్‌దేవ్ శర్మ, ఎస్‌పి

గుర్తు తెలియని వాహనం ఢీకొని క్లీనర్ దుర్మరణం

ప్రజాశక్తి-ఆనందపురం

మండలంలోని వేములవలస పెట్రోల్ బంక్ వద్ద శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ దుర్మరణం చెందాడు. స్థానికలు తెలిపిన వివరాలిలా వున్నాయి. విజయనగరం జిల్లా జోన్నాడ గ్రామానికి చెందిన బవిరెడ్డి సతీష్ (35) అలియాస్ నాని వృత్తి రీత్య లారీ క్లీనర్ పనులు చేస్తుండేవాడు. ఆనందపురం మండంలలోని ఒలారీలో క్లీనర్ పనులు చేస్తూ శనివారం ఉదయం డ్యూటీదిగి లారీ యామమాని వద్ద డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్తున్నానని చెప్పిన వ్యక్తి శనివారం అర్ధరాత్రి వేములవలస పెట్రోల్‌బంక్ వద్ద తలకు బలమైన గాయాలై మృతి చెందడంతో అలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతుడు ఎడవ చెవి తల బాగంపై బలమైన గాయం కావడంతో నడుస్తున్న వ్యక్తిని వాహనం బలంగా ఢీకొనడంతో తూలి పడి అధిక రక్తస్రావంమై అక్కడక్కడే మృతి చెందినట్లు తెలుస్తుంది. బంక్ సిబ్బంది రాత్రి 12 గంటల తరువాత అటుగా వెళ్తున్న వ్యక్తికి మృతుడు కనబడడంతో వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి నైట్‌రౌండ్‌లో ఉన్న ఎసిపిజె రామ్మోహన్‌రావు, పద్మనాభం సిఐ కిశోర్‌కుమార్, ఆనందపురం ఎస్ఐ గణేష్ చేరుకొని మృత దేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పుత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డుపై సతీష్ మృతదేహం

కళాకారుడు మృతి

మాడుగుల:మండలకేంద్రానికి చెందిన కళాకారుడు పిట్ల సాయికుమర్ తూర్పుగోదావరి జిల్లాలోని కిర్లంపూడిలో మృతి చెందారు. సాంఘిక నాటకాలకు విశేషమెన స్పందన ఉండే రోజులలో రాజాజీ ఆర్ట్స్ క్రియేషన్ తరపున ఆయన అనేక నాటకాలలో కథా, ప్రతినాయుకునిగా నటించారు. సినీ రికార్డింగ్ డ్యాన్సలలోనూ ఆయన మంచి ప్రతిభ కనబరిచారు. ఉపాధి నిమిత్తం గత కొన్ని సంవత్సరాలుగా ఆయన కిర్లంపూడిలో నివాసం ఉంటున్నారు. సాయికుమార్ మరణం పట్ల గ్రామానికి చెందిన పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో క్రషర్ దగ్ధం

మునగపాక :మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్‌తో క్రషర్ దగ్ధమైంది. భీమిశెట్టి లచ్చ మాణిక్యాలకు చెందిన క్రషర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెరరేగి చెరుకు పిప్పికి వ్యాపించాయి. దీంతో, చెరుకు పిప్పి, వరి కుప్పలు, బెల్లం పాక కాలిబూడిదయ్యాయి. సుమారుగా రూ.2లక్షల ఆస్థినష్టం నష్టం కలిగి ఉంటుందని అంచనా.


చోరీ నిందితుడు అరెస్టు

దేవరాపల్లి:మండలంలోని ములకలుపల్లి గ్రామంలో ఈ నెల 25న చోటు చేసుకున్న చోరీ కేసును స్థానిక పోలీసులు చేధించారు. ఎస్ఐ నర్సింహమూర్తి కథనం మేరకు.... గ్రామానికి చెందిన కొప్పాక ఈశ్వరరావు, తన సోదరుడు సన్యాసినాయుడు ఇళ్లలో జరిగిన చోరీలో 3 తులాల బంగారం, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు చోరీకి పాల్పడిన శిరికి విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతడి నుంచి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కె.కోటపాడు మండలం పాశిలపానిపాలెం గ్రామానికి చెందిన వాడని ఎస్ఐ పేర్కొన్నారు. గతంలో కూడా విజయ్‌కుమార్ పలు దొంగతనాలు చేశాడని చెప్పారు.

5 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఆరు రోజులు పాటు వివిధ సంగీత కార్యక్రమాలు

త్యాగరాజ ఆరాధనా ట్రస్ట్ అధ్యక్షులు సిఎస్ఎన్.రాజు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రామగోపాల్, ప్రసాద్, రాజు

ప్రజాశక్తి-మద్దిలపాలెం

నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు 'త్యాగరాజ ఆరాధనోత్సవాలు'ను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు సిఎస్ఎన్ రాజు తెలిపారు. ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఉత్సవాల బ్రోచర్‌ను ట్రస్ట్ సభ్యులు జిఆర్‌కె ప్రసాద్ (రాంబాబు), సుసర్ల రామగోపాల్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1992లో త్యాగరాజ ఆరాధనా ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. 1993లో కళాభారతిలో త్యాగరాజ మందిరాన్ని నిర్మించి అప్పటి నుంచి మూడు రోజులు పాటు త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తదనంతరం 4, 5 రోజులు పాటు నిర్వహించి ప్రస్తుతం ఆరు రోజులు పాటు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాలు జరుపుకొని 25 ఏళ్ళు నిండిన సందర్భంగా ప్రస్తుతం నిర్వహించేవి సిల్వర్ జుబ్లి ఉత్సవాలుగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఇక్కడ జరుగుతున్నాయన్నారు. నగరానికి ఈ ఉత్సవాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలుస్తున్నాయన్నారు. ట్రస్ట్ సభ్యులు జిఆర్‌కె ప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ 5వ తేదీన జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు నాద సుధార్నవ, నాద నిధి డాక్టర్ అన్నవరపు రామస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. ఆరు రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి నిష్ణాతులైన కళాకారులు పాల్గొంటున్నారన్నారు. 6వ తేదీ ఉదయం 7 గంటలకు పూజా కార్యక్రమాలతో సంగీతోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. అనంతరం కళాభారతి చుట్టూ వందలాది మంది కళాకారులతో స్వామివారిని తిరువీధిలో ఊరేగించి అధిష్టింపజేస్తామని తెలిపారు. ఉదయం 7.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిర్విరామంగా జరిగే అనేక నాదస్వర, వీణ, వేణు, గాన కచేరీల్లో ప్రఖ్యాత కళాకారులు పాల్గొంటున్నారన్నారు. సంగీత కార్యక్రమాల్లో పాల్గోవటానికి 811 దరఖాస్తులు రాగా 599 మందికే అవకాశాలు లభించాయని చెప్పారు. ఉత్సవాల్లో పాల్గొనే కళాకారులకు, పాల్గొనే భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం, రాత్రిళ్ళు ప్రసాద వితరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉత్సవాల్లో కళాకారులు, భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ట్రస్ట్ మరో సభ్యులు సురసర్ల రామగోపాల్ మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో పాల్గొనటం గొప్ప ప్రతిష్ట, అదృష్టంగా భావించి అనేక మంది కళాకారులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో కళాభారతి మేనేజర్ దాసు పాల్గొన్నారు.



శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆరిలోవ

జివిఎంసి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సంయుక్త ఆధ్వర్యంలో రెండో వార్డు, గీతాభవన్‌లో డ్వాక్రా మహిళలకు టైలరింగ్ శిక్షణా శిబిరాన్ని ఆదివారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సందర్శించారు. ఇప్పటికే టైలరింగ్ నేర్చుకొని ఉన్న మహిళలకు ఉచితంగా మోడరన్ బ్లౌజ్‌ల కుట్టులో మెళకవులు నేర్పేందుకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శిక్షణ గురించి వివరాలను మహిళలను, అధికారులను ఎమ్మెల్యే వెలగపూడి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. శిక్షణ తీసుకుంటున్న మహిళలు కొంతమంది మూడు రోజుల పాటు ఇస్తున్న శిక్షణ ఏమాత్రం సరిపోదని ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. దీనితో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కల్పించుకొని మరో మూడు రోజులు శిక్షణా కార్యక్రమాన్ని పొడించమని యుసిడి పిడి శ్రీనివాస్‌తో ఫోన్లో మాట్లాడారు. దీనికి ఆయన అంగీకరించినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భనలో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం పాల్గొన్నారు.

అపోలో ఉచిత వైద్యశిబిరం

ఆరిలోవ:ఆరిలోవ, హెల్త్‌సిటీ, అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో రెండోవార్డు, ముస్తాఫా కాలనీ, ఎన్టీఆర్ సుజల స్రవంతి ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 60 మంది రోగులకు ఉచితంగా బిపి, సుగర్, ఇసిజి వంటి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.



అప్పన్నకు విరాళం అందిస్తున్న శేషగిరిరావు

అప్పన్నకు లక్ష విరాళం

సింహాచలం:సింహాద్రి నాధుని నిత్యాన్నధాన పథకానికి విజయవాడకు చెందిన రామిశెట్టి శేషగిరిరావు రూ. 1,11,116 విరాళాన్ని ఎఇఒ రాఘవ కుమార్‌కు అందజేశారు. అనంతరం విరాళ దాతకు ఆలయ సిబ్బంది స్వామి దర్శనాన్ని కల్పించి స్వామి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం విరాళ మొత్తానికి గాను బాండ్‌ను ఎఇఒ కె.రాఘవ కుమార్ విరాళదాతకు అందజేశారు

పింఛను మంజూరు చేయరూ...

బుచ్చెయ్యపేట:చక్రాల కుర్చీకే పరిమితమై సాయం కోసం ఎదురు చూస్తున్నాడు ఓ అభాగ్యుడు. గత జన్మభూమి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా పింఛను అందలేదని పెదపూడి గ్రామానికి చెందిన బాధితుడు వియ్యపు సోమునాయుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో ట్రాలీ లారీపై క్లీనరు గా పని చేస్తుండేవాడు. 2014 సంవత్సరం మే లో అమలాపురం వద్ద తాను పని చేస్తున్న ట్రాలీ లారీ లోడుతో వెళుతుండగా విద్యుత్ వైర్లు తగల డంతో తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదం లో రెండు కాళ్ళ, చేయిని వైద్యులు తొలగించారు. దీంతో చక్రాల కుర్చీకే పరిమితం అయ్యాడు. పింఛను కోసం ఎన్నిమార్లు దరఖాస్తులు చేసినా ఫలితం లేక పోవడంతో ఎంపిడిఒ కార్యాలయం వద్ద కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ నెలలో జరిగే జన్మభూమిలో నైనా పింఛను మంజూరు చేయాలని కోరుతున్నాడు.

పేద ముస్లిములకు బియ్యం పంపిణీ



బియ్యం, పుస్తకాలు, పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ

ముస్తాఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేదలైన ముస్లిం పిల్లలకు, వృద్ధులకు బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముస్తాఫా జువలర్స్ ఆర్థిక సాయంతో రెండోవార్డు, ముస్తాఫా కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామ కృష్ణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లిం పేద విద్యార్థులకు రాత పుస్తకాలు, వృద్ధులకు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల కోసం ఇప్పటికే అనేక పథకాలను అములు చేస్తుందన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సధ్వినియోగం చేసుకోవాలని సూచించారు. టిడిపి ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండి నజీర్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలకు టిడిపి ప్రభుత్వం షాదీఖానాలు, మసీదుల నిర్మాణం, పేదలైన ముస్లింల ఆడపిల్లల పెళ్ళిళ్లకు రూ.50వేలు ఆర్థిక సహాయం వంటి పథకాలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. వార్డు మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవటమే లక్ష్యంగా టిడిపి ప్రభుత్వం మొదటి నుండి పనిచేస్తుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌కె కాలేషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముస్లిం పెద్దలు ఎండి రహీం, అక్బర్ వల్లీ, భాషా, మొహిద్దీన్, వార్డు టిడిపి అధ్యక్షులు గాడి సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం కోరే రచనలకు గుర్తింపు

ప్రజాశక్తి-భీమునిపట్నం

సమాజహితం కోరే రచనలకు ప్రజల్లో చిరకాలం గుర్తింపు, ప్రాధాన్యం ఉంటుందని పలువురు కవులు, రచయితలు స్పష్టం చేశారు. స్థానిక ఎపిఎన్‌జిఒ హోమ్‌లో కీర్తి శేషులు రెయ్యి వీరా స్వామి సాహిత్య అవార్డు పురపాలక సభ ఆదివారం జరిగింది. ఈ సభలో పాల్గొన్న కవులు, రచయితలు తమ ప్రసంగాల్లో సమాజంలో జరగుతున్న అనేక పరిణామలను వెల్లడించారు. ప్రభుత్వ విధానాల వలన మత్స్యకారుల జీవనం ప్రశ్నార్థకంగా మారనుందంటూ కవితల ద్వారా వినిపించారు. గౌరీ లంకేష్ లాంటి నిజాయితీగల పాత్రికేయులు ఎలా హత్యకు గురికాబడుతున్నారో వివరించారు. దళితులపైన, రాజ్యాంగంపైన ఇటీవల కాలంలో వరుసగా జరుగుతున్న దాడులను కవితా రూపంలో వివరించారు. పలువురు కవులు ప్రతి ఒక్కరికి సామాజిక స్పృహ వుండాలని స్పష్టం చేశారు. 93 కవితల రాగా, ఇందులో పేరెన్నికగన్న రచయితలకు, కవులకు, నిర్వాహతుల ప్రశంసాపత్రాలు, జ్ఞాప్కిలు బహూకరించి సత్కరించారు. ప్రముఖ కవి, రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఎంపిపి యరబాల కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రెయ్యి ఆదినారాయణ, కవులు, రచయితలు రాపాక సన్నీ విజయకృష్ణ, డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు, చీకటి దివాకర్, మానాపురం రాజా చంద్రశేఖర్, ఎం రత్నరాజు, బులుసు సరోజని దేవి, కొల్లాబత్తుల సత్యం, యువి రమణ పాల్గొన్నారు.



ప్రముఖ కవి సత్యనారాయణరాజుకు జ్ఞాపికలను అందజేస్తున్న నిర్వాహకులు

మొదటి పేజీ తరువాయి

నూతనోత్సాహం

యువతకు, ఉద్యోగులకు కలిసిరావడంతో ఆదివారం మధ్యాహ్నం నుండే సంబరాల్లో మునిగితేలారు. ఫోన్‌లు, మెసెజ్, వాట్సాప్, మెయిల్స్ ద్వారా పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకోవడం మొదలెట్టారు. ఐదు, మూడు, రెండు నక్షత్రాల హోటళ్లలో సంపన్న వర్గాల నుంచి మధ్య తరగతి, సామాన్యులు బాగా ఎంజాయ్ చేశారు. డిజెలు, ప్రముఖ యాంకర్స్‌తో హోటల్స్ యాజమాన్యాలు ఆకట్టుకున్నాయి. ఎంట్రీ ఫీజు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేశాయి. వాల్తేరు, సెంచరీ, ఆఫీసర్స్, కంట్రీ క్లబ్‌లు పబ్‌లను తలపించాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మందుబాబులు పూటుగా మద్యం తాగారు. మధ్యాహ్నం నుండే మద్యం షాపులు కిటకిటలాడాయి. కొంత మంది ఇళ్ల వద్ద పార్టీలు చేసుకోగా మరికొందమంది చిన్న హోటల్స్, బార్లలో మునిగితేలారు. మహిళలు, చిన్నారులు తమ ఇళ్ల ముందు ముగ్గులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు వేశారు. అర్ధరాత్రి వరకు టీవీ ఛానళ్లకు అతుక్కుపోయారు.

కిక్కిరిసిన బీచ్

ఆర్కే బీచ్ జనంతో కిక్కిరిసింది. అర్ధరాత్రి వరకు యువత పెద్ద ఎత్తున బీచ్‌లో హంగామా చేసింది. పలువురు మందు పార్టీలు చేసుకున్నారు. స్పెన్సర్‌లో మద్యం కోసం క్యూ కట్టారు. అతి ఖరీదైన మద్యం అక్కడ ఎమ్మార్పీ ధరకే అమ్మడంతోనే ఈ రద్దీకి కారణం. అంబికా సీ గ్రీన్ హోటల్, పామ్‌బీచ్, పార్కు హోటల్, నోవాటెల్, తాజ్ గేట్‌వేలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వినూత్నమైన సంగీత కార్యక్రమాలతో హోరెత్తాయి. అర్ధరాత్రి 12 గంటలు కాగానే 2018కి స్వాగతం పలుకతూ హోటళ్ల వద్ద పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు.

పోలీసు ఆంక్షలు

నూతన సంవత్సరం పేరుతో మందుబాబులు మద్యం తాగి రోడ్లపై రెచ్చిపోయే అవకాశం ఉన్నందున పోలీసులు పలు అంక్షలు విధించిన సంగతి తెలిసిందే. రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై పోలీసులు ఎక్కడికక్కడ తనీఖీలు చేశారు. పలువురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేశారు. పోలీసుల ఆంక్షలకు బయపడిన కొంతమంది ఇళ్ల వద్దే పార్టీలు చేసుకున్నారు.

శిథిలావస్థకు చేరిన శానిటరీ భవనం

- పాడవుతున్న జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు - పోలీసుల గస్తీ లేకపోవడంతో ఆకతాయిల అడ్డాగా మారిన వైనం

ప్రజాశక్తి-కలెక్టరేట్

నగరంలోని 24వ వార్డు మహారాణిపేటలో ఉన్న జివిఎంసి శానిటరీ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. విలువైన జనన, మరణ రికార్డులను ఈ భవనంలో భద్రపరుస్తారు. అలాగే ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమయ్యే సామాగ్రి కూడా ఇక్కడే ఉంచుతారు. నిత్యం ఉద్యోగులు, కార్యార్థులతో కిటకిటలాడే కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. కార్యాలయ ప్రాంగణం రాత్రయితే ఆకతాయిలకు అడ్డాగా మారుతోందని స్థానికులు అంటున్నారు.

ప్రస్తుతం ఈ భవనం స్లాబ్‌నుంచి పెచ్చులూడిపోతున్నాయి. ఏ మాత్రం వర్షం వచ్చినా రికార్డులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. బ్లీచింగ్ పౌడర్, విలువైన చీపుర్లు, సామాగ్రి పాడవుతున్నాయి. తలుపులు, కిటికీలు శిథిలావస్థకు చేరడంతో తోస్తే పడిపోయే స్థితిలో ఉన్నాయి. దీంతో కార్యాలయంలో ఉండే రికార్డులకు, సామాగ్రికి భద్రత కరవవుతోంది. ఇక్కడ పనిచేసే సిబ్బంది ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనే ఆందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. జనన, మరణ, ఎన్‌ఓసి ధ్రువపత్రాలకు, పలు పనుల నిమిత్తం వచ్చే కార్యార్థులు సైతం కార్యాలయంలోకి వెళ్లేందుకు జంకుతున్నాయి.

ఈ ప్రాంగణంలో రాత్రయితే చాలు అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారుతోంది. జివిఎంసి ఎన్నిసార్లు వీధి దీపాలు వేసినా ఆకతాయిలు రాళ్లు విసిరి పగులగొడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రతిరోజూ తెల్లవారి చూసే సరికి మద్యం సీసాలు కార్యాలయ ఆవరణలోనే పడి ఉంటున్నాయి. సెలవు దినాల్లో పగటిపూట జూదం జోరుగా సాగుతోంది. స్థానికంగా ఉన్నవారు ప్రశ్నిస్తే వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ దాడులకు ఎగబడుతున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోనే ఉన్నా... ఒక్క రోజూ కూడా ఇటువైపు రాత్రిపూట పోలీసులు గస్తీ నిర్వహించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సమస్య తీవ్రత దృష్ట్యా కార్యాలయాన్ని వేరే చోటుకి మార్చటం లేదా భవనాన్ని పునర్నిర్మాణం చేయాల్సి ఉందని స్థానికులు అంటున్నారు.

నేడు పద్యనాటక పోటీలు

కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉత్తరాంధ్ర పౌరాణిక పద్యనాటక కళాకారుల సంక్షేమ సేవా సంఘం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కళాభారతి ఆడిటోరియంలో ఏకపాత్రాభినయ పోటీలు, యుద్ధ సన్నివేశాల ప్రదర్శన ఉంటుందని సంఘం అధ్యక్షులు బడే శ్రీరాములు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళా ఆసుపత్రి అధినేత డాక్టర్ పివి రమణమూర్తి, ఆత్మీయ అతిథిగా జివిఎంసి జోన్-2 కమిషనర్ పల్లి నల్లనయ్య పాల్గొంటారని చెప్పారు. ఏకపాత్రాభినయ పోటీలతో పాటు, భక్త అంబరీశ (రాజాం) శ్రీరామాంజనేయ యుద్ధం (అనంతపురం), గయోపాఖ్యానం (తూర్పుగోదావరి జిల్లా) పౌరాణిక ఘట్టాల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

నర్సీపట్నం రూరల్ : మండలంలోని వేములపూడి కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్‌ఎస్‌ఎ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షి సాగర్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం కోసం రోజూ వ్యాయామం చేయాలన్నారు. చదువులో రాణిస్తేనే జీవితంలో ఉన్నతికి చేరుకోగలన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు. చదువులో ఎక్కువ, తక్కువ అనే వ్యత్యాసాలు రానివ్వకుండా, ఇష్టపడి అర్థం చేసుకొని చదివితేనే విజేతలుగా నిలుస్తారన్నారు. పాఠాలను అర్థం చేసుకొని చదివితే మంచి ప్రయోజనముంటుందన్నారు. పుస్తకాల్లో చదివే విషయాలకన్నా స్వతంత్రంగా నేర్చుకుంటేనే ఎక్కువ కాలం గుర్తుంటాయి అన్నారు. రానున్న పరీక్షలకు ఇప్పటినుంచే ప్రణాళికను రూపొందించుకొని, క్రమపద్ధతిలో చదివితే మంచి గ్రేడింగ్ సాధ్యపడుతుందన్నారు. ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోవటం విద్యార్థుల ప్రథమ లక్షణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి కె. భవాని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పెదబయలు : జనవరి 6,7,8 తేదీల్లో నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బండా సన్నిబాబు కోరారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురంలో మూడు రోజుల పాటు ఈ మహాసభలు జరుగుతాయన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి, భవిష్యత్ పోరాటాలపై కార్యాచరణ రూపొందిస్తారన్నారు.

వణికిస్తున్న 'చలిపులి'

పాడేరు : విశాఖ మన్యాన్ని మంచు తీవ్రంగా కమ్మేస్తోంది. అధిక సంఖ్యలో మన్యాన్ని సందర్శిస్తున్న పర్యాటకులు విపరీతంగా కురుస్తున్న మంచుతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటల వరకు దర్శనమివ్వని సూర్యుడుతో పాటు సాయంత్రం మూడు గంటల నుంచే చలి గాలులు తీవ్రంగా వీస్తుండడంతో మన్యవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

చేనేత హస్త కళామేళా ప్రారంభం

కలెక్టరేట్ : చేనేత వస్త్రాలు హుందాతో పాటు ఆరోగ్యాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఎంవిపి కాలనీలోని టిటిడి కళ్యాణ మండపంలో కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా మేళాను ఆదివారం జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలతో పాటు, హస్తకళలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. వినియోగదారులంతా సంక్రాంతి పండగ సందర్భంగా ఈ ప్రదర్శనను వినియోగించుకోవాలన్నారు.



చేనేత హస్త కళా మేళాను తిలకిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వీటిని ప్రోత్సహించాలన్నారు. సంస్థ అధ్యక్షులు జెల్ల సత్యనారాయణ మాట్లాడుతూ పోచంపల్లి, కలంకారి, ఖాదీ వస్త్రాలతో పాటు మంగళగిరి చీరలు, బ్లౌజ్ మెటీరియల్స్, హైదరాబాద్ ఎంబ్రాయిడరీ చీరలు, గద్వాల్, చీరాల డ్రెస్ మెటీరియల్స్, జైపూర్ బెడ్‌షీట్స్ తదితర ప్రాంతాల ఉత్పత్తులు అందుబాటులో ఉంచామన్నారు. హస్తకళలకు సంబంధించి కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ మంచి ముత్యాలు, బంజారా ఉత్పత్తులు, లెదర్ బ్యాగ్‌లు, జ్యూట్ బ్యాగులు, గృహాలంకరణ వస్తువులు ఉంచామన్నారు. జనవరి 12 వరకు మేళా ఉంటుందన్నారు. సంస్థ సహాయ కార్యదర్శి వడ్డే పల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'దేశాభివృద్ధే జాగృతి సంస్థ లక్ష్యం'

డాబాగార్డెన్స్ : దేశాన్ని ప్రగతి బాటలో నడిపించడమే తమ లక్ష్యమని జాగృతి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశుతోష్ తెలిపారు. డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంటర్‌ప్రైజ్‌లను ప్రోత్సహించడమే ధ్యేయంగా దేశవ్యాప్తంగా జాగృతి యాత్రను చేపడుతున్నట్లు వెల్లడించారు. జాగృతి యాత్ర 10 ఎడిషన్ ఈ నెల 24న ముంబాయిలో ప్రారం భమైందని, ఈ రైలులో యాత్ర కొనసాగి తిరిగి జనవరి 8వ తేదీన ముంబాయిలో ముగుస్తుందని తెలిపారు. ఈ యాత్రలో మొత్తం 500 మంది పాల్గొన్నారని, వారిలో 50 శాతం మహిళలేనని పేర్కొన్నారు. జాగృతి యాత్రం ముఖ్యమైన విషయాలపై అవగాహన పెంచుతుందన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, నీరు, పారిశుధ్యం, చదువు, ఎనర్జీ తదితర అంశాలపై అవగాహన పెంచుతుందన్నారు. ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రైలులో 8 వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తూ యాత్రికులు ఎన్నో విషయాలు తెలుసుకుంటారన్నారు. యాత్రలో భాగంగా తాము విశాఖ చేరుకున్నా మని తెలిపారు. ఇక్కడ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను సందర్శించామన్నారు. విశాఖ నుంచి బయలు దేరి బరంపూర్ చేరుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో జాగృతి సంస్థ ప్రతినిధి మోదేవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత

నర్సీపట్నం : మున్సిపాలిటీలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యతనివ్వాలని నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ చింతకాయల అనిత అన్నారు. ఆదివారం తడి, పొడి చెత్త సేకరణకు వేర్వేరుగా కొత్తడస్ట్‌బిన్‌లను స్థానిక సరగమ రెస్టారెంట్‌లో ప్రారంభించారు. వీటిని పలువురు దాతలు సమకూర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ అవార్డు సాధించే దిశగా మున్సిపల్ అధికారులు కృషి చేస్తున్నారన్నారని, వారికి అందరూ సహకరించాలన్నారు. మూడోసారి కూడా ఉత్తమ ఒడిఎఫ్ మున్సిపాలిటీగా నర్సీపట్నం ఎంపికకావడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. మున్సిపాలిటీలో అనేక రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 15వ వార్డులో రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, కౌన్సిలర్ చెరుకూరి సత్యనారాయణ, నవ్య లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు, వార్డు ప్రజలు, రెస్టారెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బొర్రా గుహలకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల్లో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. విదేశీ, స్వదేశీ పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బొర్రాగుహలు కిక్కిరిసింది. సెలవు రోజు కావడంతో పర్యాటకుల తాకిడి పెరగడంతో పర్యాటక శాఖకు టిక్కెట్ల రూపేణా అధికంగా ఆదాయం వచ్చింది. వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు స్థలం లేక దారి పొడవునా వాహనాలను రహదారి పక్కన నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. బొర్రాతో పాటు కటికి, తాడిగుడ, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూ-పాయింట్ వద్ద కూడా పర్యాటకుల సందడి చేశారు. 2017 సంవత్సరానికి గుడ్‌బై చెబుతూ, నూతన సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు అధికసంఖ్యలో యువత సందర్శిత ప్రాంతాలకు చేరుకున్నారు.

'జాబిల్లి రావె..' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్

వెంకటమణి ఈశ్వర్ రచించిన "జాబిల్లిరావె.. కోటి కథలు తేవె.." పుస్తకం ఆవిష్కరణను ఆదివారం నిర్వహించారు. లలితానగర్‌లోని స్వాతంత్ర్య సమర యోధులు, తొలి పార్లమెంట్ సభ్యులు కందాళ సుబ్రహ్మణ్య తిలక్ గృహంలో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత వెంకట మణి ఈశ్వర్ మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితులు అంతకంతకూ బాలలకు ఏ మాత్రం సురక్షితం కానివిగా మారాయన్నారు. పిల్లలపై అఘాయిత్యాల నుంచి పిల్లలే అఘాయిత్యాల్కు పాల్పడే స్థితికి సమాజం దిగజారిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో బాలల వ్యక్తిత్వ వికాసానికి టీచర్లు, రచయితలు ఉద్యమ స్ఫూర్తితో కృషి చేయాల్సిన అవసరం కనిపిస్తోందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని బాల సాహిత్యం అవసరాన్ని తెలియపరుస్తూ "జాబిల్లిరావే... కోటి కథలు తేవే" అనే పుస్తకాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ పుస్తకాన్ని నగరంలో 1000 పాఠశాలల్లో ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సరికే పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు.

జనవరి 15న బౌద్ధమేళా

కలెక్టరేట్ : విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో అనకాపల్లి సమీపంలోని బౌద్ధారామం బొజ్జన్న కొండ వద్ద జనవరి 15న పెద్ద ఎత్తున బౌద్ధమేళాను నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి బోర వేణుగోపాల్ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళాలో భాగంగా బౌద్ధ పతాకావిష్కరణ, భగవాన్ బుద్ధుని చరిత్ర పుస్తక ఆవిష్కరణ, బౌద్ధ సాహిత్య పుస్తకాలు విక్రయాలు, ప్రదర్శన, నూతన బుద్ధుని క్యాలెండర్ ఆవిష్కరణ, బౌద్ధ భిక్షువులచే బుద్ధ వందనం పూజ, ప్రార్థనలు, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. బౌద్ధులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ప్రకటన చేసిన వారిలో కోన వెంకటరమణ ఉన్నారు.

స్వరరంజని అధ్యక్షురాలిగా జవ్వాది లక్ష్మి



కలెక్టరేట్ : నగరంలో గుర్తింపు కలిగిన స్వర రంజని లలిత సాంస్కృతిక సంస్థ నూతన కార్యనిర్వాహక ఎన్నికలు ఆదివారం బిల్డర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించారు. ప్రస్తుత అధ్యక్షురాలు సునర్ల శేషమణి అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో సంస్థ నూతన అధ్యక్షురాలుగా జవ్వాది లక్ష్మి ఎన్నికయ్యారు. రచయిత్రి, గాయని అయిన లక్ష్మి ఇంత వరకు సంస్థకు ఉపాధ్యక్షురాలుగా పనిచేశారు. సంస్థ వ్యవస్థాపకులు కొసన ఆధ్వర్యంలో ఎన్నికలు చేపట్టారు. ప్రధాన కార్యదర్శిగా వివి కనకదుర్గ, కోశాధికారిగా ఎం లక్ష్మి, ఉపాధ్యక్షులుగా పిఆర్ సూర్యకుమారి, కె లతారాములు, ఎన్నికయ్యారు. ఎస్ మీనాక్షి, పివి పద్మని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోబడ్డారు. ఈ పాలక వర్గం రెండేళ్ల పాటు ఉంటుంది.

పాపాహోంలో నూతన సంవత్సర వేడుకలు

కలెక్టరేట్ : పోలీసు రిజర్వ్ బారెక్స్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) ప్రాంగణంలో ఆదివారం నూతన సంవత్సర స్వాగత వేడుకలను నిర్వహించారు. పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న బివి రమణ, డి ప్రేమ్ విజయ్, ఎం నరసింహ, బి షణ్ముక, బి హర్ష పుట్టిన రోజు వేడుకలను ఘనంగా ఇదే సందర్భంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి పి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాపాహోంలో ఆశ్రయం పొందుతున్న వారంతా బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు డి సూర్య ప్రకాశరావు, వి రాజ్యలక్ష్మి, ఆర్‌సి జైన్, జిఎస లక్ష్మి, టి హేమ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాలు ఐకమత్యంతో మెలగాలి

నాతవరం : ఆటోవాలాలంతా యూనియన్‌గా ఐక్యమత్యతతో మెలగాలని ఎస్ఐ జి.అశోక్‌కుమార్ సూచించారు. ఆదివారం తాండవ జంక్షన్‌లో శ్రీ సిద్ధివినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ కార్మికులకు ఏటా ఆనవాయితీగా ఇస్తున్న బోనస్‌ను పంపిణీ చేశారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
వి-శాఖ
సోమవారం 1 జనవరి 2018

కెవ్వు కేకు

దుకాణాలకు కొత్త సంవత్సరం కళ



వీటిని తయారు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రజాశక్తి-కలెక్టరేట్

నిత్యం తియ్యనైన అనుభూతులను వెంటేసుకు తిరగాలని ప్రతి వ్యక్తీ కాంక్షిస్తాడు. ఈ తియ్యని అనుభూతులు ప్రతినిత్యం వెంట ఉండాలనే కాంక్షతో పండగలకూ, పెళ్లిళ్లకూ, సంవత్సరాదికీ, జన్మదినాలకూ కేకులను కట్‌చేసి అనుభూతులు పంచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నలుగురిలో మనం సంతోషాన్ని పంచుకోవాలని అనుకుంటే ఉత్తమ సాధనం 'కేకు'లే అంటే అతిశయోక్తి కాదు. అందుకే నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించాలనుకునేవారు కొత్తగా, వినూత్నంగా

నోరూరించే రకాలు..

వివిధ రంగుల్లో అలరాలే.. హరివిల్లులా చూడగానే ఆకట్టుకునే ఈ కేకులంటే అందరికీ మక్కువే. సమ్మోహనమైన రూపంతో నోరూరించే కేకులు వెనిలా, స్ట్రాబెర్రీ, చాకోలైట్, పైనాపిల్, మ్యాంగో తదితర ఫ్లేవర్స్‌లో ఆదివారం లభ్యమయ్యాయి. వివిధ రంగులలో కళాత్మకంగా కేకులపై వేసే డిజైన్స్ ఆకట్టుకున్నాయి. నిజమైన పుష్పగుచ్ఛాలను తలపించే పుష్పాకృతులను కేకులపై వేసిన బేకర్ల నిపుణతకి పలువురు ఫిదా అయ్యారు. కోరిక మేరకు కావాల్సిన పరిణామంలో కేకులను తయారు చేసి యజమానులు పలువురి మెప్పు పొందారు. ముందుగా ఆర్డర్ లేకుండా ఎప్పటికప్పుడు కోరుకునేవారి అవసరాల కోసం చిన్న చిన్న కేకులను కూడా ఆదివారం న్యూ ఇయర్ ఆఫర్ల పేరిట సిద్ధం చేశారు. నగరంలో కేకుల ధర షాపును బట్టి కిలో రూ.500 నుంచి రూ.900 మధ్య ఉంది. డిజైన్స్, ఫ్లేవర్లను బట్టి ధరల్లో మార్పులు కనిపించాయి. ఎక్కువ ధర పెట్టి కేకులు కొనలేని సామాన్యుల కోసం రూ.100 నుంచి కూడా చిన్న చిన్న కేకులు మార్కెట్‌లో లభించాయి.

క్రిస్మస్ మొదులుకుని..

నగరంలో క్రిస్టియన్లు, ఆంగ్లో ఇండియన్లు అధికంగా ఉండటంతో క్రిస్మస్‌కు కేకులను విరివిగా కొనుగోలు చేశారు. క్రిస్మస్ మరుసటి రోజు నుంచి నూతన సంవత్సరం హడావుడి ఎక్కువగా కనిపించింది. ఆర్డర్లు ఇచ్చిందే తడవుగా హాట్‌కేకులను సిద్ధం చేసి దుకాణదారులు ఇచ్చేశారు. ప్రతిరోజూ 20 నుంచి 25 కేకుల అమ్ముడువుతుంటాయని, న్యూ ఇయర్ సందర్భంగా 200కుపైగా కేకులను ఆదివారం ఒక్కరోజే విక్రయించామని దొండపర్తిలోని ఓ కేకుల దుకాణం వ్యాపారి తెలిపాడు.

వివిధ రకాల కేకులు – ధరలు (కిలోకు)	
కోకో ట్రపుల్	-700
వైట్ ఫారెస్ట్	-900
బ్లాక్ ఫారెస్ట్	- 600
చెక్ జియమ్ బి/ఎస్	-900
పైనాపిల్	-500
కోకో త్రుపుల్	-700
బదర్ స్కోటెక్	-600



జగదాంబ జంక్షన్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న కేకులు

కొత్త ఆకృతుల్లో కేకులు

నూతన సంవత్సరం కోసం ఈసారి నూతన ఆకృతుల్లో కేకులను తయారు చేశాం. గిటారు, సీతాకోక చిలుక, తాజ్ మహల్, రైలు బండి, టైటానిక్ ఆకృతులతోపాటు బాహుబలి ఏనుగు ఆకృతుల్లో కేకులను సిద్ధం చేశాం. కేకుల తయారీలో కోడిగుడ్డు ఉపయోగిస్తుంటాం. ఇందువల్ల కొందరు శాఖాహారులు కోడిగుడ్డు లేకుండా కేకులు కావాలని అడుగుతున్నారు. వారు కోరిన విధంగానే ప్రత్యేకంగా వెజిటేరియన్ కేకులు కూడా తయారు చేస్తున్నాం. గత ఏడాది కంటే ఈ ఏడాది కేకుల వ్యాపారం ఆశాజనకంగా ఉంది.

పివి.నాయర్, శాస్త్రా బేకరీ, రామాటాకీస్



న్యూ ఇయర్ జోష్

నగరంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు ఉత్సుకత చూపడంతో ఆదివారం మార్కెట్లన్నీ కళకళలాడాయి. జగదాంబ, ద్వారకానగర్, పూర్ణామార్కెట్, గాజువాక, గోపాలపట్నం ప్రాంతాల్లోని దుకాణాలు సందడిగా కనిపించాయి.

గ్రీటింగ్ కార్డ్స్, కేకులను కొనేందుకు యువత పోటీ పడ్డారు. ముగ్గులు వేసేందుకు అనువైన రంగులను ఎంపిక చేసుకోవడంలో మహిళామణులు లీనమయ్యారు.



జోరుగా బొకేల అమ్మకాలు

కలెక్టరేట్ : 'విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్' అంటూ గ్రీటింగ్ కార్డులు ఇచ్చుకోవడం ఎంత సంప్రదాయమో, అదే మాదిరిగా పుష్పగుచ్ఛాలు (బొకేలు) ఇచ్చి అభినందించుకోవడం కూడా ఒక ఆనవాయితీ. మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులు శుభాకాంక్షలు, అభినందనలు తెలుపుతూ పుష్పగుచ్ఛాలను ఇవ్వడం నేడు పరిపాటిగా మారింది. దీనిని ఆసరాగా చేసుకుని వీటిని అమ్మే దుకాణాలు నగరంలో పలు చోట్ల ఏర్పాటయ్యాయి. నూతన సంవత్సర వేడుకలకు ఒక రోజు ముందుగా ఇవి చాలా చోట్ల పుట్టుకొచ్చాయి. వాటిలో ఒక్కొక్క బొకే ధర రూ.50 నుంచి రూ.500 వరకు ఉంది. చేమంతి పూలతో తయారు చేసే బొకేలు ఎక్కువగా అమ్ముడుబోయాయి. మేలు జాతి గులాబీతో అత్యంత సుందరంగా కనిపించే రకాలు, కళాకృతులు ఉట్టిపడేలా తయారుచేసిన బొకేల కొనుగోలుపై ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. నగరంలోని సిరిపురం జంక్షన్, పూర్ణా మార్కెట్, ఆశీలుమెట్ట, అక్కయ్యపాలెం, ఎంవిపి కాలనీ, ఎయు పరిసరాల్లో బొకేల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.



బొకేలను కొనుగోలు చేస్తున్న యువకుడు

క్రీడాభివృద్ధికి ఉక్కు సంకల్పం



క్రీడలను ప్రారంభిస్తున్న బ్యాడ్మింటన్ స్టార్ పివి.సింధు

స్టీల్‌ప్లాంట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు
అన్ని ఆటలకూ అనువుగా మైదానాలు
జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ

ప్రజాశకి-ఉక్కునగరం

ప్రపంచ వ్యాప్తంగా క్రీడలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దల వరకూ ఆటలు ఆడటానికి అమితాసక్తి కనబరుస్తారు. ఆటలతో శారీరక వ్యాయామం, మానసిక ఉల్లాసంతో పాటు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆటలు ప్రతి ఒక్కరి జీవితంలో నేడు భాగమైపోయాయి. ఇంకా చెప్పాలంటే క్రీడలనే తమ కెరీర్‌గా మార్చుకునే వారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా గణనీయంగా పెరిగిపోతోంది. మరోపక్క వీటిలో రాణిస్తున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, కళాశాలల అడ్మిషన్లలో రిజర్వేషన్లు, ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలు అందుతున్నాయి. క్రికెట్, బ్యాడ్మింటన్ లాంటి ఆటలు ఆడితే పేరు ప్రఖ్యాతలతో పాటు సంపాదన కూడా అదే రీతిలో ఉంటోంది. దేశ వ్యాప్తంగా క్రీడలు, క్రీడాకారులకు ప్రోత్సాహం ఎలా ఉన్నప్పటికీ దేశీయ ఉక్కు రంగంలో తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) యాజమాన్యం మాత్రం క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి మాత్రం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. దీని కోసం ఏకంగా స్టీల్‌ప్లాంట్ క్రీడా విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ఈ విభాగం ఉక్కునగరంలో ఉన్న క్రీడా మైదానాల అభివృద్ధితో పాటు, అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను తన ఆధ్వర్యంలో నిర్వహించింది.

కల్నల్ సికె.నాయుడు ఉక్కు స్టేడియం

క్రీడాకారులు సాధన చేయడానికి ముఖ్యంగా అన్ని హంగులు, సౌకర్యాలతో కూడిన మైదానాలు కావాలి. మరికొన్ని ఆటలకు ప్రత్యేక కోర్టులు ఉండాలి. వీటి అవసరం గుర్తించిన యాజమాన్యం ఉక్కు జనరల్ హాస్పటల్‌కు సమీపంలో సువిశాల ప్రాంతంలో ఉక్కు స్టేడియాన్ని నిర్మించింది. ఈ స్టేడియానికి క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన సికె.నాయుడు ఉక్కు స్టేడియంగా నామకరణం చేసింది. ఈ స్టేడియంలో ప్రతి ఆటకూ సంబంధించి ప్రత్యేక కోర్టులు ఉన్నాయి.

ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం

బ్యాడ్మింటన్ ఆటకు సంబంధించి ప్రత్యేకంగా ఇండోర్ స్టేడియాన్ని స్టీల్‌ప్లాంట్ నిర్మించింది. అన్ని సదుపాయాలతో షటిల్ కోర్టులను తీర్చిదిద్దింది. ఇక్కడ ఉదయం, సాయంత్రం క్రీడాకారులు వచ్చి సాధన చేస్తారు. ప్రత్యేకంగా కోచ్‌లు కూడా ఉండటం విశేషం.

ప్రతి ఆటకూ ప్రత్యేక ఏర్పాట్లు

ఉక్కు స్టేడియంలోనే లాంగ్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్ ఆడటానికి అనువుగా ప్రత్యేక కోర్టులను సిద్ధం చేశారు. ఇక్కడ క్రీడాకారులు ఆటలు ఆడటానికి, శిక్షణ పొందడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఇక బాక్సింగ్ సంబంధించి కోచ్‌లను నియమించి క్రీడాకారులను సుశిక్షిత శిక్షణ అందిస్తున్నారు.

బ్రాండ్ అంబాసిడర్‌గా పివి.సింధు

క్రీడాకారులను ప్రోత్సహిఁచడంలో ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం ఎప్పుడూ ముందుంటుంది. అందులో భాగంగానే బ్యాడ్మింటన్‌లో అంతర్జాతీయ స్థాయిలో దూసుకుపోతున్న తెలుగుతేజం పివి.సింధును విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది.

అథ్లెటిక్స్‌కు సంబంధించి ప్రత్యేక ట్రాక్‌లు, క్రికెట్ సాధనకు అనుగుణంగా మైదానం ఉండటం మరో ప్రత్యేకత

జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు వేదికగా ఉక్కు స్టేడియం

కల్నల్ సికె.నాయుడు ఉక్కు స్టేడియం ఎన్నో జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వేదికగా నిలుస్తూ వస్తోంది. క్రికెట్ సంబంధించి రంజీ ట్రోఫీ మ్యాచ్‌లతో పాటు అండర్ 19 అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇచ్చిన ఘనత ఉక్కు స్టేడియానికి దక్కుతుంది. ఇక గత ఏడాది నవంబర్‌లో జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఉక్కు స్టేడియం వేదికగా నిలిచి అందరి చూపునూ తనవైపుకు తిప్పుకుంది. ఈ పోటీలను ఇప్పటి మన దేశ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రారంభించటం విశేషం. ఈ పోటీలకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది క్రీడాకారులు హాజరయ్యారు. మరో వైపు జాతీయ ఇంటర్ స్టీల్ క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్ పోటీలను ఈ స్టేడియంలోనే నిర్వహించారు.

ప్రత్యేకంగా స్టీల్‌ప్లాంట్ క్రీడా విభాగం ఏర్పాటు

క్రీడాభివృద్ధి కోసం ఉక్కు యాజమాన్యం ప్రత్యేకంగా స్టీల్‌ప్లాంట్ క్రీడా విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అత్యధిక మంది సిబ్బంది వివిధ క్రీడల్లో తమదైన గుర్తింపు పొందిన వారు కావడం విశేషం. ఈ విభాగంలోని సిబ్బంది ఎప్పటికప్పుడు మైదానాల అభివృద్ధి, వివిధ క్రీడా పోటీల నిర్వహణ, క్రీడాకారుల శిక్షణకు సంబంధించి నిత్యం ప్రణాళికలు రచిస్తూ ఉంటారు. ఇక మైదానాలను ఎప్పటికప్పుడు తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక సిబ్బంది ఉన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు

క్రీడా విభాగంలో ఆధ్వర్యంలో ఏటా వేసవిలో ప్రత్యేక క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ ఉంటారు. ఈ శిక్షణా శిబిరంలో ప్రతి ఏడాదీ ఉక్కునగరంలోని చిన్నారులు, పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తుంటారు. ప్రత్యేకంగా కోచ్‌లను కూడా నియమిస్తారు.

త్రిష్నా మైదానం, హాకీ ఫీల్డ్

స్టీల్‌ప్లాంట్‌లో ఉక్కు స్టేడియంతో పాటు సెక్టార్ 5లో త్రిష్నా మైదానం కూడా ఉంది. ఇక్కడ కూడా అనేక పోటీలను నిర్వహిస్తూ ఉంటారు. ఈ మైదానంలో ముఖ్యంగా ఫుట్‌బాల్ మ్యాచ్‌లతో పాటు క్రికెట్ పోటీలు జరుగుతాయి. పరేడ్‌ల నిర్వహణ ఈ గ్రౌండ్ ప్రత్యేకత. ఇక సెక్టార్ 1లో విశాఖపట్నంలోనే ఎక్కడా లేని విధంగా సకల హంగులతో హాకీ ఫీల్డ్‌ను ఉక్కు యాజమాన్యం నిర్మించింది. ఇటీవలే ఇక్కడ నేషనల్ ఇంటర్ స్టీల్ హాకీ పోటీలు నిర్వహించారు.



కల్నల్ సికె.నాయుడు స్టేడియం



క్రీడలకు హాజరైన విద్యార్థులు



ఉక్కు స్టేడియం వ్యూ

మరిన్ని పోటీల నిర్వహణకు సిద్ధం

క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఉక్కు యాజమాన్యం ముందుంది. క్రీడాకారులకు శిక్షణ, మైదానాల అభివృద్ధికి సంబంధించి నిత్యం పర్యవేక్షణ ఉంటుంది. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తుండం విశేషం. ఇప్పటికే ఎన్నో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించాం. భవిష్యత్తులో మరిన్ని పోటీల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం



ఎంఎస్.కుమార్,
స్టీల్‌ప్లాంట్ క్రీడావిభాగాధిపతి

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ హెచ్‌వై దొర - విజెఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సీతమ్మధార

సమాజ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, నగరంలో వైజాగ్ జర్నలిస్టు ఫోరం నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయనమని ఎపిఇపిడిసిఎల్ చైర్మన్ హెచ్‌వై దొర అన్నారు. సీతమ్మధార నార్ల వెంకటేశ్వరరావు భవన్‌లో ఆదివారం జర్నలిస్టులకు నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు జాయింట్ పోలీసు కమిషనర్ రవికుమార్ మూర్తి, సెంచూరియన్ విశ్వ విద్యాలయం ఉప కులపతి జిఎస్ఎన్ రాజు, వైసిపి నాయకులు మళ్ల విజయ్‌ప్రసాద్, హాజరై పాత్రికేయులకు అందజేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి కీలకపాత్ర పోషించేది జర్నలిస్టులు మాత్రమేనని అన్నారు. అటువంటి జర్నలిస్టులకు ప్రతి ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు వారి సంక్షేమానికి కృషి చేస్తున్న విజెఎఫ్ క్లబ్‌కు అభినందనలు తెలుపుతునానమన్నారు. విజెఎఫ్ చేపట్టే కార్యక్రమాల్లో తమని భాగస్వామ్యం చేయడం ఆనందాయకమన్నారు. జర్నలిస్టులందరికి నూతన, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజెఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, కార్యదర్శి దుర్గారావు మాట్లాడుతూ విజెఎఫ్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేదోడు అందిస్తున్న వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఏడాదిలో జర్నలిస్టుల ఆటవిడుపు, సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ ఏదైనా వుంది అంటే అది విజెఎఫ్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో దాడి రవి, నాగరాజు పట్నాయక్, నానాజి, లక్ష్మి, ఎంఎస్ఆర్ ప్రసాద్, గిరి, ఈరోతి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, విజెఎఫ్ కార్యవర్గ సభ్యులు



ర్యాలీ నిర్వహిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు

పాఠశాల స్వర్ణోత్సవాల ప్రచార ర్యాలీ

ప్రజశక్తి - మాధవధార

స్థానిక మాధవధార జివిఎంసి పాఠశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ ప్రచార ర్యాలీని పాఠశాల స్వర్ణోత్సవాల కమిటీ చైర్మన్ సనపల బంగారురాజు ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవధార, వుడాకాలనీ, సీతన్నగార్డెన్స్, శంకర్‌నగర్, మాన్యం, తేన్నెటినగర్, మురళీనగర్, బిర్లా జంక్షన్‌లో ఇంటింటికీ వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేసి స్వర్ణోత్సవాలకు హాజరు కావాలని కోరారు. వచ్చే యేడాది జనవరి 30, 31, ఫిబ్రవరి 1వ తేదిన 3రోజుల పాటు నిర్వహించనున్న స్వర్ణోత్సవాల్లో మాధవధార, మురళీనగర్, కంచరపాలెం, మర్రిపాలెం, కరాస, ఐటిఐ జంక్షన్, పరిసరాల ప్రాంతాలలో అందరూ హాజరై, వేడుకల్లో భాగస్వామ్యం చెంది విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సనపల పాండురంగారావు, పేడాడ సత్యనారాయణ, గొండు అచ్యుతరావు, సనపల రవికుమార్, నంబాళ్ళ అప్పలనారాయణ, పూర్వ మహిళా విద్యార్థులు పైడి పుణ్యవతి, సనపల రత్నకుమారి, సనపల సుమతి, సనపల నాగమణి, కర్రి మాధవరావు, పప్పల రామరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

దాతల సహయంతో పాఠశాల అభివృద్ధి

పూర్వ విద్యార్థులైన దాతల సాయంతో రూ.4 లక్షలతో పాఠశాల అభివృద్ధికి పనులు ప్రారంభించడం జరుగుతుందని చైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా పాఠశాల ప్రాంగణంలో ఆడిటోరియం నిర్మాణం, మరుగుదొడ్లను ఏర్పాటు, జనవరి 3వ తేదిన మధ్యాహ్నం 1 గంటకు విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రులతో ప్రారంభించనున్నట్లు తెలిపారు.



మళ్లకు నివేదికను అందజేస్తున్న వైసిపి నాయకులు

పార్టీ అభివృద్ధికి కృషి

మల్కాపురం : వైసిపి బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని వైసిపి నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ అన్నారు. ఈ మేరకు జివిఎంసి 45వ వార్డు పరిధి ఎకెసి కాలనీ బూత్ కమిటీ ఎన్నికలు గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా జరిగాయి. అనంతరం నివేదికను నగర అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్‌కు వారు అందజేశారు. ఈ సందర్భంగా మళ్ల మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారంలో పార్టీ కార్యకర్తలు చురుగ్గా స్పందించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలను మెరుగుపర్చే బాధ్యత పార్టీ కార్యకర్తల భుజస్కంధాలపైనే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేస్తూ పార్టీ అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. వార్డు పార్టీ అధ్యక్షునిగా గుండపు నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షునిగా సోమదుల సురేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా కొట్నాన రవి, బిసి సెల్ అధ్యక్షులుగా వంటాకు సూరిబాబు, సేవాదళ్ అధ్యక్షునిగా భానోజీరావు, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా శరగడం గంగరాజు, ప్రచార కమిటీ అధ్యక్షులుగా చీపుర్లు వెంకటప్పారావు, సోషల్ మీడియా అధ్యక్షులు పుక్కల నిర్మల్ ఆనంద్, జిల్లా కమిటీ సభ్యులు గేదెల రమణ, వారావి నారాయణరావు, సిటీ కమిటీ నాయకుడు కేబుల్ రాజు, బడు దుర్గలను ఎన్నుకున్నారు.

పెంచిన థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న వామనమూర్తి

సీతమ్మధార : మోటార్ వాహనాలపై పెంచిన థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ వెంటనే రద్దు చేయాలని ఎపి ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్(ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో అఖిలపక్ష ఆటో మోటార్ కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60 శాతం గూడ్సు సామగ్రిని, పాసింజర్లను గమ్యస్థానాలకు చేరవేస్తూ రోడ్డు రవాణా రంగంపై సుమారు 25 కోట్ల కుటుంబాలు ప్రత్యక్షంగాను పరోక్షంగాను మరో 10 కోట్ల కుటుంబాలు రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. మోటారు రంగం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంవత్సరానికి వేలాది కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతోందన్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు లేక ఆటోలు నడుపుతూ తమ కుటుంబాలు పోషించుకుంటున్న రవాణా కార్మికులు రోడ్డున పడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రవాణా రంగాన్ని నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రవాణా రంగం వాహనాలపై థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ భారీగా పెంచడమే కాకుండా పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల దుష్ప్రభావాలను భరిస్తూ జీవిస్తున్న మోటారు రంగం కార్మికుల నడ్డి విరిచేలా ప్రభుత్వం ఏకపక్ష చర్యలు తీసుకుంటోందని ధ్వజమెత్తారు. ఎఫ్‌సిలపై రోజుకు రూ.50 జరిమానా, డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్‌కు గతంలో రూ.50 ఉంటే నేడు రూ.వెయ్యికి, రూ.320 ఉన్న ఎఫ్‌సి చలానాను రూ.700లకు పెంచి కార్మికుల స్వయం ఉపాధిని ప్రభుత్వం దెబ్బతీస్తోందన్నారు. వ్యానులు, కారులు ట్రావెల్ అద్దెకు తిప్పుతున్న కార్లకు పోటీగా ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలైన ఓలా, ఉబెర్ తదితర సంస్థలను ప్రవేశపెట్టి లక్షలాది మందికి ఉపాధి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు జానకి రామిరెడ్డి, దుర్గా మల్లేశ్వరరావు, అడ్డూరి శంకరరావు, రామారావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌పై బండారు వ్యాఖ్యలు అర్థరహితం

పెందుర్తి : వైసిపి అధినేత జగన్‌పై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ వ్యాఖ్యలు అర్థరహితమని, ఆయన నోరు అదుపులో ఉంచుకోవాలని వైసిపి పెందుర్తి ఇన్‌చార్జి అన్నంరెడ్డి ఆదిప్ రాజు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. జగన్ గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యే బండారుకు లేదన్నారు. తమ అనయాయలతో దళితులపై దాడి చేస్తే వారిని మందలించాల్సింది పోయి ఆ నెపాన్ని వైసిపిపై మోపడం దుర్మార్గమన్నారు. నేటికీ బాధిత దళితులను ఆయన పరామర్శించలేదంటే దళితుల పట్ల ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్ధమవుతోందన్నారు. బండారు తనయుడు స్థానికంగా కబ్జాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

12వ రోజుకు హెల్త్ అసిస్టెంట్ల రిలే దీక్షలు

పాడేరు రూరల్ : తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్‌లు చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. రోజులు గడుస్తున్నా అధికారుల్లో చలనం లేకపోడంతో జనవరి 2వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టేందుకు బాధిత ఆరోగ్య కార్యకర్తలు సంసిద్ధమవుతున్నారు. దీక్షలో ఎటువంటి సంఘటనలు జరిగినా అందుకు ఐటిడిఎ పిఒ, ఎడిఎం అండ్ హెచ్ఒ పూర్తి బాధ్యత వహించాలని ఆరోగ్య కార్యకర్తల సంఘం నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణ్ అన్నారు.

సంక్షేమ పథకాలకు వారధులుగా సాధికారమిత్రలు

అవగాహన సదస్సులో రాష్ట్రమంత్రి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం : ప్రభుత్వ అభివఅద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అర్హులైన వారందరికీ పథకాలు అందించేందుకు సాధికారమిత్రలను ఏర్పాటు చేశామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం నర్సీపట్నంలో నిర్వహించిన సాధికారమిత్రల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వినూత్న ఆలోచనతో ప్రతి 35 కుటుంబాలకు సమన్వయకర్తగా డ్వాక్రా మహిళలను సాధికారమిత్రగా నియమించారన్నారు. మొట్ట మొదటిగా మన రాష్ట్రంలోనే సాధికారమిత్ర విధానాన్ని ప్రారంభించారన్నారు. వీరు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తారన్నారు. ప్రభుత్వ పథకాల పట్ల చదువుకున్న వారికి కూడా పూర్తి అవగాహన లేని పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సాధికారమిత్ర ఆ బాధ్యతను నిర్వర్తించి, అర్హులకు ప్రభుత్వ పథకాలను చేరువచేస్తారన్నారు. రాజకీయాలకతీతంగా పక్షపాతానికి తావివ్వకుండా నిజమైన లబ్ధిదారులను గుర్తించి అందరికీ న్యాయం జరిగేలా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం కార్యక్రమాల అమలు తీరును సమీక్షిస్తారన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి నెలకు పదివేల ఆదాయం వచ్చేలా చేయాలన్నదే చంద్రబాబు ఆశయమని తెలిపారు. జిల్లాలో 27 వేల మందిని, నర్సీపట్నం నియోజకవర్గంలో 3110 మంది సాధికార మిత్రులను నియమించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 46 లక్షల మందికి పింఛన్లు అందజేస్తున్నామని, ఈ జన్మభూమిలో మరో ఐదు లక్షలు కొత్త పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఒంటరి మహిళలకు పింఛన్లు ఇచ్చే ఆలోచన ఉన్నట్లు వెల్లడించారు. తలసేమియా బాధపడేవారికి, నపుంసకులకు కూడా వికలాంగ పింఛన్లు ఇస్తామన్నారు. గఅహ నిర్మాణ పథకంలో రూ.1.50 లక్షల యూనిట్ విలువగా ఇళ్లను 19 లక్షల మందికి మంజూరుచేశామని ఒక కోటి42 లక్షల మందికి రేషన్ కార్డులు ఇచ్చామని, ప్రతి గ్రామంలోనూ పశుగ్రాసం కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వ పెట్టుబడితో పచ్చగడ్డి పెంచి, రైతులకు సబ్సిడీ ధరలకు సరఫరా చేస్తారన్నారు. వెలుగు పథక సంచాలకులు సత్యసాయి శ్రీనివాస్ పాల్గని, సాధికారమిత్రల నియామకం, వారి విధులు, బాధ్యతలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సూర్యారావు, మెప్మా పథక సంచాలకులు పి.ప్రమీలారాణి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

జన్మభూమిని జయప్రదం చేయాలి

- పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు - ప్రజలను భాగస్వామ్యం చేయాలని వివిధ శాఖల అధికారులకు సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం

తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని, విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గోపాలపట్నం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగే జన్మభూమి కార్యక్రమంలో కంటే భిన్నంగా ఇందులో ప్రజలను భాగస్వాములను చేస్తూ వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సాధికార మిత్ర సభ్యులను ప్రజలకు పరిచయం చేస్తామని వెల్లడించారు. ఈ సభ్యులు ప్రభుత్వ తరుపున ప్రజల సమస్యలు తెలుసుకొని నిష్పక్షపాతంగా పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తారని చెప్పారు. ముఖ్యంగా జనవరి 3న కంచరపాలెంలో సదరన్ సర్టిఫికెట్లు కోసం ప్రభుత్వం తరుపున క్యాంపును ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అక్కడికి వికలాంగులు వారి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు పట్టుకొళ్తే అక్కడ సదరన్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తారని చెప్పారు. దీంతో వారికి ప్రభుత్వ పింఛనుకు అర్హులని గుర్తించి కొత్త ఏడాది నుంచి పింఛన్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. స్థలం ఉండి ఇళ్లు కట్టుకోవటానికి ముందుకొస్తే వారికి ప్రభుత్వ రూ.2.50 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో ప్రస్తుతం 1930 ఇళ్లను కడుతున్నామని, ఇంకా అర్హులైన వారు ఉంటే దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. నియోజకవర్గం పరిధిలో చంద్రన్న భీమాలో 89,900 మంది చేరారని చెప్పారు. గతంలో సాధారణ మరణానికి రూ.30 వేలు చెల్లించే వారనీ, ప్రస్తుతం అది రెండు లక్షలకు చేరిందని చెప్పారు. మన నియోజకవర్గంలో ఎక్కువ మంది పేద ప్రజలు ఉన్నట్లు ఈ బీమా ద్వారా తెలుస్తుందని అన్నారు. విద్య, వైద్య సదుపాయాలను పేదవారికి పూర్తి ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బహిరంగ మలమూత్ర విసర్జన రహిత నగరంగా విశాఖను తీర్చదిద్దటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. విశాఖ నగరం నేడు సుందర నగరంగా రుపాంతరం చెందుతోందని, దాని కాపాడుకోవటానికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని కోరారు.



సత్యనారాయణకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

రేవల జన్మదిన వేడుకలు

మల్కాపురం : జివిఎంసి 47వ వార్డు టిడిపి కార్యాలయంలో రేవల సత్యనారాయణ జనవరి ఒకటో తేదీన జన్మదినం సందర్భంగా తన నివాసంలో ఆయనను ఎమ్మెల్యే గణబాబు ఆదివారం ఘనంగా సత్కరించారు. టిడిపి నేతల సమక్షంలో కేక్‌ను కట్ చేసి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ మరిన్ని జన్మదినాలు సత్యనారాయణ జరుపుకోవాలని, కార్యకర్తలకు దిశానిర్దేశం జరుపుతూ పార్టీని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు శీరం పైడిరాజు, బర్రి సూర్యప్రకాష్, మజ్జి మాలినాయుడు, అల్లబోయిన వంశీకిషోర్ యాదవ్, శంకర్, నక్కా లక్ష్మణరావు, కోరాడ శ్రీను, అమరావతి తదితరులు పాల్గొన్నారు.



సిఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

గోపాలపట్నం : జివిఎంసి 68వ వార్డు గణేష్‌నగర్‌కు చెందిన పెతకంశెట్టి సత్యారావు ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు స్వయంగా మృతుని ఇంటికి వెళ్లి సిఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి ఒక్కరినీ ఆదుకుంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నారిపిన్ని సత్తిరాజు, దొడ్డి చంద్రశేఖర్, కొల్లు అప్పారావు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

మల్కాపురం : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని షిప్‌యార్డు విశ్రాంతి ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనాన్ని రామకృష్ణాపురం సిఐటియు ఆఫీసులో సోమవారం ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ నాయకుడు కె నూకరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విశ్రాంతి ఉద్యోగులంతా కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

చిన్నారులకు ఖురాన్ కంఠస్థ పోటీలు

కంచరపాలెం : రాష్ట్ర స్థాయి ఖురాన్ కంఠస్థ ప్రతిభ పోటీలను ఎన్ఎడి కూడలి వద్దనున్న మస్జిద్ తహసీన్‌లో ఆదివారం ఉదయం నిర్వహించారు. యునైటెడ్ ఫోరమ్ ఖురానిక్ స్టూడెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది, కోస్తాంధ్ర యోధుల సంఘం కన్వీనర్ ఐఎం అహ్మద్ హాజరై పోటీల్లో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు ఖురాన్, సర్టిఫికేట్స్‌తో పాటుగా నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖురాన్‌లో మానవుని జీవనశైలి ఎలా వుండాలో పవిత్ర ఖురాన్ బోధిస్తోందన్నారు. నైతికంగా, న్యాయంగా జీవించాలని ఖురాన్ సూచిస్తోందన్నారు. ఖురాన్ పవిత్ర గ్రంథంలో గ్రంథం యావత్ మానవాళికి అని ఇది కేవలం ముస్లిం సమాజం కోసం కాదన్నారు. రాష్ట్ర పరిధిలో వివిధ జిల్లాల మస్జిద్‌లో నిర్వహిస్తున్న ఖురాన్ కంఠస్థ పోటీల్లో ప్రతిభ కనబరచి ఫైనల్స్‌లోకి చేరుకున్న వారికి ఫిబ్రవరి 18న విజయవాడలో జరిగే ఫైనల్స్‌లో గెలుపొందిన వారికి నగదు బహుమతితో పాటు సర్టిఫికెట్లను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ ప్రతిభ పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా మౌల్వి అబ్దుల్ రషీద్, మహమ్మద్ అమిన్ ఉమ్రి వ్యవహరించారు. కార్యక్రమంలో జమాతే ఇస్లాం హింద్ అధ్యక్షులు ఇబ్రహీం, జిల్లా అధ్యక్షులు రహ్మతుల్లా, యుఎఫ్ఐఎస్ రాష్ట్ర ఇన్ ఛార్జ్ మహమ్మద్ అక్బర్ బాషా, సభ్యులు, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల మస్జిద్ కమిటీ సభ్యులు, చిన్నారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐఎం అహ్మద్

యువజనోత్సవాలలో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

యూనివర్సిటీ స్థాయి ఉత్సవాలకు కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపిక

మల్కాపురం : జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విశాఖ జిల్లా స్థాయిలో ఎవిఎన్ కళాశాల వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎన్ఎస్ఎస్ యువజనోత్సవాల్లో స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిభ కనబర్చారు. చిత్రలేఖనంలో సిహెచ్ శ్వేత, ఏకపాత్రాభినయంలో పి శ్యామలగౌరి, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని పొందారు. వక్తృత్వ పోటీల్లో ఎ మాధురి, పద్యరచనలో ఎం లావణ్య, బృందనాట్యంలో కవిత, లక్ష్మీప్రియ, పావని, సితార, బి సీత, సుప్రియ ద్వితీయ స్థానాలను పొంది యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవాలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో వీరికి జాతీయ సేవా పథకం ఎయు కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్‌డి సంపత్‌కుమార్, జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను బహూకరించారు. ఈ సందర్భంగా వీరందరినీ సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రేమ అభినందించారు. టీం లీడర్లుగా వ్యవహరించిన వై అనసూయాదేవి, ఎ ఆదిలక్ష్మిలను ప్రశంసించారు. జిల్లా స్థాయి యువజనోత్సవాలలో భాగంగా ఎవిఎన్ కళాశాల యాజమాన్యం, జిల్లాలోని ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లను ఘనంగా సత్కరించారు.



ఇపిఎస్ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న అధ్యాపకులు



ప్రతిభ కనబర్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు



రక్తదాతలకు ప్రశంసాపత్రాలిస్తున్న పివి సురేష్ తదితరులు


రక్తదానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-మల్కాపురం

రక్తదానంతో ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని అమర్ స్కూల్స్ చైర్మన్ జి అమర్ అన్నారు. ఈ మేరకు జివిఎంసి 46వ వార్డు పరిధి పిలకవానిపాలెంలోని అమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం పాఠశాల ప్రిన్సిపల్ వాసుదేవరావు, సంజీవని వాలంటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానమిచ్చారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ రక్తం సకాలంలో అందక పలువురు విలువైన ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దాత ఇచ్చే రక్తంతో ముగ్గురి ప్రాణాలను కాపాడే అవకాశముందన్నారు. శిబిరంలో యువకుల నుంచి 40 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. రక్తదాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విశాఖ యూత్ అధ్యక్షుడు తిప్పల వంశీరెడ్డి, పివిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ పివి సురేష్, బ్లడ్‌బ్యాంక్ పిఆర్ఒ వి రమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన

మల్కాపురం : జివిఎంసి 46వ వార్డు గుల్లలపాలెం కమ్యూనిటీ హాలులో పెదిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో ప్రజలకు పోలీసులు వివిధ అంశాలపై ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిఐ కేశవరావు నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యూఇయర్, సంక్రాంతి పండుగలకు ఊళ్లకు వెళ్లే వారంతా పోలీసుస్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనబడితే తమకు తెలియజేయాలన్నారు. మందు తాగి వాహనాలు నడపరాదని సూచించారు. క్రైం ఎస్ఐ దాలిబాబు మాట్లాడుతూ ఇతర ఊర్లకు వెళ్లేవారు తమ ఇంట్లో బంగారం, నగదు, ఇతర విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. బంగారానికి మెరుగుపెడతామని మభ్యపెట్టే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమానికి బిఎస్‌పి పశ్చిమ కన్వీనర్ పెదిరెడ్ల నానాజీ, గుల్లలపాలెం గ్రామ అధ్యక్షుడు రఘు, జిల్లా తెలుగు యువత కార్యదర్శి పోతబత్తుల శ్రీను వర్మ, వై రాము పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్యే గణబాబు

క్రీడా మైదానం ప్రారంభం

మల్కాపురం : జివిఎంసి 48వ వార్డు పరిధి ఇందిరా కాలనీలో జివిఎంసి నిధులతో పున:నిర్మించిన క్రీడా మైదానాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో క్రీడా మైదానాలను ఎక్కువగా లేనందు వల్ల యువత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారి అవస్థను గమనించి క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. క్రీడల్లో చురుగ్గా పాల్గనప్పుడు మరింత ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొట్టి మూర్తి, శీరం పైడిరాజు, పెంటకోట అప్పలనాయుడు, వార్డు అధ్యక్షుడు కొరిబిల్లి రాము, మజ్జి సోమేష్, నాయకులు జోజి తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో రాజకీయ సెగ

- చర్చకు తెరలేపిన టిడిపి ఆత్మీయ సమ్మేళనం
- దూకుడు పెంచిన వైసిపి
- చాపకింద నీరులా జనసేన

ప్రజాశక్తి - గాజువాక

2019 ఎన్నికలే లక్ష్యంగా గాజువాక నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో పొలిటికల్ హీట్ మొదలైంది. అధికార పార్టీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రతి రోజూ మామూలు కార్యక్రమాలు నిర్వహించి ఏడాది చివరిలో ముఖ్య కార్యకర్తలలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ సారి అప్పటి కన్నా ఒక అడుగు ముందుకేసి ఆదివారం యారాడ పార్కులో తెలుగుదేశం ఆత్మీయ సమ్మేళనం పేరుతో రోజంతా ఆటపాటలతో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ సమావేశం జరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో ఆయన ఎంపీగా, ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కూడా ఇదే విధంగా ముందస్తు కార్యక్రమాలు ఏర్పాటు చేసి విజయవంతమయ్యారు. ఇప్పుడు కూడా ఆయన ఇదే ఎత్తుగడను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

మరోపక్క మూడేళ్లుగా మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మామూలు కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. గత జులైలో మాత్రం ఆయన పుట్టిన రోజు వేడుకలను భారీ ఎత్తున చేపట్టారు. ఈసారి కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు పూనుకున్నారు. ఆయన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి భారీ ఎత్తున క్యాడర్‌ను సమీకరించే పనిలో పడ్డారు. ఆయన కూడా ఈ ఏడాది మొత్తం ప్రజల్లో ఉండి వచ్చే ఎన్నికల్లో జనసేన తరుపున పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు క్యాడర్‌కు సంకేతాలు పంపించారు. ఇప్పటికే చాపకింద నీరులా కార్యక్రమాలను చేపడుతున్నారు.



కార్యకర్తలతో కలిసి ధర్నా చేస్తున్న వైసిపి నేత నాగిరెడ్డి

ఇప్పటికే రెండు సార్లు ఓటమి చెందిన వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి ఇదే ఆఖరి అస్త్రంగా రంగంలోకి దిగుతున్నారు. ప్రతిపక్ష పార్టీలో ఉన్నా ఆయన కొంతకాలం నుంచి హుషారుగా కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. అయితే గాజువాకలో ఇప్పటికే యాదవ, కాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులైతేనే ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం ఉంటుందని ప్రచారం ఊపందుకుంది. నాగిరెడ్డి మాత్రం బిసి ఓట్లే తనను గెలిపిస్తాయన్న ధీమాతో ముందుకు వెళ్తున్నారు. గడిచిన ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావుకు వన్ సైడ్ ఓటింగ్ జరిగినప్పటికీ నాగిరెడ్డికి 70 వేల ఓట్లు పోలయ్యాయి. మరికాస్త కష్టపడితే గెలవొచ్చన్న ధీమాలో ఆయన ఉన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నామమాత్రంగానే ఉంది. ఈ పార్టీ కాస్త బలం పెంచుకుంటే వైసిపికి నష్టం జరిగే అవకాశం ఉంది. జనసేన ఎన్నికల్లో పోటీ చేస్తే టిడిపికి పూర్తి స్థాయిలో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. రాజశేఖర్ రెడ్డి హవా కొనసాగిన సమయంలోనూ గాజువాకలో ప్రజారాజ్యం తరుపున చింతలపూడి అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా చిరంజీవి, పవన్ కల్యాణ్ అభిమానులు ఎక్కువ సంఖ్యలో నియోజకవర్గంలో ఉండటమే దీనికి కారణం. దీంతో ఆయన కూడా ఊపు పెంచారు. ఏదేమైనా ఏదొక పేరుతో ఈ ఏడాది బల సమీకరణలో అన్ని పార్టీలూ నిమగ్నమై ఉన్నాయి.



ఆత్మీయ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

బిటి రోడ్డుకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం : జివిఎంసి 58వ వార్డు పరిధిలోగల రాజీవ్‌నగర్ ప్లై ఓవర్ బ్రిడ్జి నుంచి రాసాలమ్మ కాలనీ వరకూ రూ.30 లక్షలతో తలపెట్టిన బిటి రోడ్డు పనులకు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రజా సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. టిడిపి వార్డు నాయకులు ఎం.కనకరాజు, నల్లూరి సూర్యనారాయణ, కె.శ్రీనివాస్, జె.సాయి కుమార్, డి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాలో ప్రమాదంపై విచారణ జరపండి

గాజువాక : పరవాడ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా పార్కులో కోరీ ఆర్గానిక్స్ పరిశ్రమలో శనివారం జరిగిన పేలుడుపై విచారణ జరపాలని పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీరామమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఫార్మా కంపెనీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



పూజలు నిర్వహిస్తున్న స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి మధుసూదన్

ధనుర్మాస ఉత్సవాల్లో స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి

కూర్మన్నపాలెం : జివిఎంసి 53వ వార్డు పరిధి లక్ష్మీపురం కాలనీలో ఉన్న శ్రీశ్రీశ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో చేపడుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో అదివారం స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి పి.మధుసూదన్ పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో చేస్తున్న విధంగా ఇక్కడ కూడా పూజలు చేయటం అభినందనీయమని, ఆలయ అభివద్ధికి సహకరిస్తామని అన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయన్ని సత్కరించి జ్ఞాపిక అందజేశారు. చిన్నారులు చేసిన నత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొర్లె వెంకునాయుడు, కెవిఎస్ఎన్.రాజు, కల్లేపల్లి శ్రీనివాసరాజు, కాశీరాజు, రామ చంద్రరాజవర్మ, వరహాలబాబు, కరణం కనకఅప్పారావు, కెవిఎస్ఎన్.రాజు, చంద్రశేఖర్, బి.వెంకట రమణరాజు, రాజాన వెంకటస్వామి రాజు, రమణ, వంశీ, చిట్టిబాబు, సూరినారాయణ, సోంబాబు, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

'సమైక్య'లో నూతన సంవత్సర వేడుకలు

గాజువాక : తోకాడ గ్రామంలోని సమైక్య అపార్టుమెంటులో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి రాత్రి పది గంటల వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టారు. అపార్టుమెంటు వాసులంతా ఒకే చోటుకు చేరి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో తౌడన్న, మత్స్యరాజు, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో ఆటల పోటీలు

ప్రజాశక్తి - గాజువాక

ఐద్వా జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జోగవానిపాలెంలో ఆటల పోటీలు నిర్వహించారు. సంఘం నాయకులు కె.సంతోషం పర్యవేక్షణలో మ్యూజికల్ ఛైర్, లెమన్ స్పూన్ ఆటల్లో ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారు. సమీరా బేగం, శివ కుమారి, సుధారాణి, సూర్యకుమారి హాజరయ్యారు.

స్నేహపురికాలనీలో ముగ్గుల పోటీలు

స్నేహపురి కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. చిన్నారులకు మ్యూజికల్ ఛైర్ పోటీలు చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షులు పివైవి.రమణరావు మాట్లాడుతూ ప్రతి ఏడాదీ నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా ముందు రోజు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వరరాజు, సభ్యులు అప్పారావు పాల్గొన్నారు. సుభద్రాదేవి, ఈస్టన్ ఉషా కుమారి, వాణిలు జడ్జిలుగా వ్యవహరించారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న స్నేహపురికాలనీ వాసులు



మ్యూజికల్ ఛైర్ పోటీలో జోగవానిపాలెం మహిళలు

రైల్వేట్రాక్ నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం

శనివాడలోని హిందుజా రైల్వే ట్రాక్ నిర్వాసితులకు న్యాయం చేయాలని అగనంపూడి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండయ్యవలసలో రైల్వే ట్రాక్ బాధితులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యే, రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.

ఉత్తమమైన నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఇప్పటికే నిర్వాసితులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అభివృద్ధికి తాము అడ్డంకి కాదని, అదే క్రమంలో బాధితులకూ న్యాయం జరగాలన్నది తమ ఆకాంక్షని తెలిపారు. కార్యక్రమంలో గోపి, శ్రీను, సోమినాయుడు, స్వామి, నాగరాజు పాల్గొన్నారు.

డిసిఐ ప్రయివేటీకరణపై పాదయాత్ర

ప్రజాశక్తి - పెదగంట్యాడ

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటూ నిర్వాసిత కాలనీలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. సిఐటియు నగర కార్యదర్శివర్గ సభ్యులు పివిఎస్‌బి.శ్రీనివాసరాజు మాట్లాడుతూ లాభాలతో నడుస్తున్న డిసిఐని ప్రయివేటీకరించాలనుకోవడం దుర్మార్గమన్నారు. పెట్టుబడిదారులకు కారుచౌకగా ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేడమే ధ్యేయంగా కేంద్రంలోని బిజెపి వ్యవహరించడం దారుణమన్నారు. ఇదేనా ఆ పార్టీ చెప్పే దేశ భక్తి అని ప్రశ్నించారు. విధానాలను మార్చుకోకుంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. స్టీల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కణితి అప్పల రాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించకుండా నష్టాల్లోకి నెడుతున్నారని అన్నారు. ఈ విషయమై ప్రజలను చైతన్య పరుస్తున్నామని చెప్పారు.

పాదయాత్ర పెదగంట్యాడ, సీతానగరం, బాల చెరువు, తదితర గ్రామాల్లో సాగింది. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.సత్యారావు, జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, బి.ఢిల్లీరావు, బి.ప్రసాద్, ఆనంద్, సింహాచలం, బి.గురప్ప, రమణారెడ్డి, అనిల్ కుమార్, నీలాపు అప్పలరెడ్డి, ఆర్‌టి.రాజు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న సిఐటియు నాయకులు

మద్దిలో ట్రాఫిక్ సమస్య తీవ్రం


మద్ది గ్రామంలో రోడ్లపై ఇరుగ్గా నడుస్తున్న ట్రాఫిక్

బైపాస్ రోడ్డు ఏర్పాటుకు 2005 నుంచి ప్రణాళికలు ఆచరణకు నోచని వైనం

ప్రజాశక్తి - పద్మనాభ

మండలంలోని మద్ది గ్రామాన్ని ట్రాఫిక్ సమస్య వెంటాడుతోంది. ఇరుకైన రహదారి కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి 2005 నుంచి స్థానిక నాయకులు ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేదు.

మద్ది గ్రామంలో రెండు వేల కుటుం బాలు నివాసముంటున్నాయి. ఐదు వేల ఓటర్లు, పది వేలు జనాభా ఉంటుంది. ఈ గ్రామానికి ఉత్తర దిక్కున గోస్తనీ నది, మిగిలిన మూడు దిక్కుల్లో రైతుల పొలాలు ఉన్నాయి. పద్మనాభం నుంచి సింహాచలం వెళ్లే రోడ్డుకు ఆనుకొని గ్రామాలో రోడ్డు వేశారు. గ్రామంలో రాకపోకలకు ఇదొక్కటే మార్గం. ఈ రోడ్డు గ్రామం మధ్యలో నుంచి ఉంది. ఎనిమిది అడుగుల వెడల్పు మాత్రమే ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బంది తప్పడం లేదు. దీని వల్ల ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు కీర్తిశేషులు కంటుభుక్త సత్యం 2005లో ప్రయత్నాలు చేశారు. గ్రామం నుంచి బైపాస్ రోడ్డు వేయడానికి ఆలోచన చేశారు. తమ భూమిలో నుంచి రోడ్డు వేయడానికి ముందుకొచ్చారు. యాతపేట, దళిత కాలనీని ఆనుకొని గోస్తనీ నది మీదుగా పాండ్రంగి గ్రామానికి వెళ్లే సాగునీటి కాలువపైన ఉన్న వంతెన వద్ద రోడ్డును కలపడానికి ప్రణాళిక రూపొందించారు. అయితే ఈ మధ్యలో కొంత మంది రైతులు తమ భూమి ఇవ్వడానికి ఇష్టపడకపోవడంతో ఈ పనులు ఆగిపోయాయి. ఈ ప్రయత్నం చేసిన కంటుభుక్త సత్యం కీర్తిశేషులయ్యారు. తరువాత రాజకీయ పరిణామాలు మారాయి. ప్రస్తుతం గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి తదితర పదవులు టిడిపి మండల అధ్యక్షులు కాళ్ల నగేష్‌కుమార్ పరిధిలో ఉన్నాయి. ఆయన కూడా ఈ రోడ్డు సమస్యపై దృష్టి పెట్టారు. గతంలో అనుకున్న మార్గంలో కాకుండా మరో మార్గంలో చేయడానికి ఆలోచన చేశారు. పద్మనాభం నుంచి మద్ది వస్తున్న మార్గంలో జామి సత్యం పశువుల పాక నుంచి ఆర్ అండ్ బి రోడ్డును కలుపుకొని గోస్తనీ నదిలోకి దించి గ్రామానికి కొంత దూరంగా పాండ్రంగి పోవు సాగునీటి కాలువ వద్ద కలపాలని ప్లాన్ చేస్తున్నారు. ఇలా చేస్తే అలమండ రైల్వే స్టేషన్‌తో పాటు విజయనగరం జిల్లా జామి మండలానికి మరింత దగ్గరిగా ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే గ్రామానికి ట్రాఫిక్ సమస్య తీరనుంది. అయితే ఇది ప్రణాళికల వద్దే ఆగిపోతుందా? లేదా కార్యరూపం దాల్చుతుందా? అనేది వేచి చూడాలి


కప్పస్తంభం వద్ద రామకృష్ణారావు దంపతులు

అప్పన్న చెంత ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం

అప్పన్నను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఈ రోజు స్వామిని దర్శించిన వారిలో జాయింట్ సెక్రటరీ ఫర్ హోమ్ ఎఫైర్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా బిపిన్ బిహారీ ఐఎఎస్ దంపతులు అలహాబాద్ జడ్జి విజయలక్ష్మి దంపతులు తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ డిప్యూటి ప్రిన్సిపల్ సెక్రటరీ కె.రామకృష్ణారావు దంపతులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు సాధారంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనము చేసుకొని బేడా మండపం చుట్టూ ప్రదక్షిణం చేసి గోదాదేవి సన్నిధిలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. అస్థాన మండపం అర్చకులు ఆశీర్వదించగా అధికారులు స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

జన్మభూమి గ్రామసభల షెడ్యూల్

భీమునిపట్నం:జివిఎంసి భీమిలి జోన్ పరిధిలో జనవరి నెలలో జరగనున్న జన్మభూమి షెడ్యూల్‌ను జెడ్సీ బి సన్యాసినాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 జనవరి 3న 1, 2, 13, 14 వార్డుల్లోను, 4న 3, 4, 15, 16, వార్డుల్లోనూ, 5న 5, 6 17, 18 వార్డులను 6న 7, 8, 19, 20 వార్డుల్లోను 8న 9, 10, 21, 22 వార్డుల్లోనూ, 9న 12, 2, 3, 24 వార్డుల్లోను, 10న 25, 26, 27, 28 వార్డుల్లోనూ గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

కొత్త సంవత్సర ఏర్పాట్లు

పద్మనాభం:మండలంలోని పలు గ్రామాలలోని నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఇళ్ల ముందు రంగురంగులతో ముగ్గులు వేసి వాకిళ్లను అందగా మలిచారు. బంతి, గులాబీ, చామంతి వంటి పువ్వులను అధికంగా కొనుగోలు చేశారు. మార్కెట్‌లు అమ్మకాళ్ళ, కొనుగోళ్లతో కిటకిటలాడాయి. వాతావరణ చల్లగా మారడంతో చల్లగాలులను సైతం లెక్కచేయకుండా మహిళలు రకరాల రంగుతలతో ముగ్గులు వేశారు. 12 గంటలకు కేక్ కట్ చేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు.

విద్యార్థులను రక్షించిన కమ్యూనిటీ గార్డులు

సాగర్‌నగర్:జివిఎంసి ఆరోవార్డు పరిధి రుషికొండ బీచ్‌లో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. వీరిని కమ్యూనిటి గార్డులుకాపాడంతో ప్రాణాలతో బయట పడ్డారు.దీనికి సంబంధించిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పిఎంపాలెం నారాయణ కాలేజీ విద్యార్థులు పదిమంది రుషికొండ బీచ్‌కు వచ్చారు. స్నానాలు చేస్తుండగా కెరటాల బలంగా రావడంతో ప్రవీణ్‌రానా, కునాల్, ఆసిష్ పోతనాయక్ అనే ముగ్గురు విద్యార్థులను గల్లంతయ్యారు. మిగిలిన విద్యార్థులు కేకలు వేయడంతో బీచ్ కమ్యూనిటీ గార్డులు వారిని రక్షించిఒడ్డుకు తీసుకురావడంతో మిగిలిన విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. రక్షించిన కమ్యూనిటీ గార్డులు దేవ, జి రాజేష్, రాజేష్‌కుమార్‌లను బీచ్ మెబైల్ పోలీసుల, పోలీసులు పర్యాటకులు అభినందించారు.


విద్యార్థును కాపాడి వడ్డుకు చేరుస్తున్న కమానిటీ గార్డులు


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గంటా

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సింహాచలం

ఆడవివరంలో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి క్యాలెండర్‌ను మంత్రి గంటా చేతుల మీదుగా ఆవిష్కరించారు. గంటా నివాసంలో జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణలో కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి చైర్మన్ కర్రి అప్పలస్వామి పాలక మండలి సభ్యులు గంట్ల కిరణ్, ఎర్రి వరంబాబు, లోగిశ గణేష్, టిడిపి నాయకులు గుసిడి శంకర్‌రావు, వాసుగోపాల్, ఎస్.అప్పారావు, తోట మధు, పతివాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


కుర్చీలు పంపిణీ చేస్తున్న నూకరాజు

అంగన్‌వాడీ పిల్లలకు కర్చీల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం

వాసవీ వనితా సౌభాగ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేములవలస గ్రామంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గల పిల్లలకు కుర్చీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనిత జిల్లా గవర్నర్ నల్లూరి నూకరాజు, రీజనల్ చైర్మెన్ టి.అమర్‌నాథ్, జోన్ చైర్మన్ టి.రమేష్, వాసవీ వనితా సౌభాగ్యం అధ్యక్షులు మామిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ స్థలం కబ్జాకు యత్నిస్తే ప్రతిఘటిస్తాం

ప్రజాశక్తి-భీమునిపట్నం

స్థానిక 23వ వార్డు అప్పికొండ వీధిలోని విజయరామ గజపతినగర్‌లో ఏళ్ల తరబడి 144 కటుబంలో నివసిస్తున్నామని, సంబంధిత స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తే ఐక్యంగా ప్రతిఘటిస్తామని నాగవంశ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బుగత నర్సింగరావు హెచ్చరించారు. భీమిలి బిల్డర్స్ అసోసియేషన్ పేరుతో ఖాళీ స్థలంగా చూపించి న్యాయస్థానం సైతం తప్పుదోవ పట్టించారని ఆయన ఆరోపించారు. స్థానికులకు సంఘీభావం తెలుపుతూ నాగవంశ సంక్షేమ సంఘం ప్రతినిధులు విజయరామ గజపతి నగరంలో ఆదివారం పర్యటించారు. మీకు తామంతా అండగా వుంటామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం స్థానిక విలేకర్లతో నర్సింగరావు మాట్లాడుతూ గత కొన్నేళ్లగా నివాసాల ఏర్పాటు చేసుకున్న స్థానికులకు రెగ్యులరైజేషన్ చట్టం కింద సంబంధిత నివాస స్థలాలను క్రమబద్ధీకరించి, అన్నీ హక్కుల్నీ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగవంశ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోగుబోతు జనర్ధనరావు మాట్లాడుతూ ఇక్కడ నివశిస్తున్న వీరంతా పేద, మధ్య తరగతి కుటుంబీకులేనని, వీరి పట్ల కక్ష పూరితంగా వ్యవహరించడం సరైంది కాదని బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు స్పష్టం చేశారు. వీరికి అన్యాయం తలపెడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. సంఘం రాష్ట్ర కో-ఆర్డినేట్ అవనాపు వీర్రాజు, జిల్లా కోశాధికారి అప్పికొండ అప్పలనాయుడు, స్థానిక టిడిపి నాయకులు గాడు సన్యాసినాయుడు, కనకల అప్పలనాయుడు పాల్గొన్నారు.


బాధితులను సంఘీభావం తెలుపుతున్న నర్సింగరావు

చిట్టివలస జ్యూట్‌మిల్లును తెరిపించాలి

చిట్టివలస లేబర్ యూనియన్ అధ్యక్షులు పడాల రమణ

ప్రజాశక్తి-తగరపువలస

సుదీర్ఘకాలంగా మూతపడిన చిట్టివలస జ్యూట్‌మిల్లును తక్షణమే తెరిపించాలిన చిట్టివలస లేబర్ యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షులు పడాల రమణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక జిఆర్ భవన్‌లో యూనియన్ కార్యవర్గ సభ్యులు సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పడాల రమణ మాట్లాడుతూ తనను గెలిపిస్తే చిట్టివలస జ్యూట్‌మిల్లును తెరిపిస్తానంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రస్తుత మంత్రి గంటా శ్రీనివాసరావు నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా యాజమాన్యంతో చర్చించి, మిల్లు తెరిపించేందుకు కృషి చేయాలని కోరారు. లేకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సమయంలో కార్మికులు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్మికులకు చెల్లించాలని పిఎఫ్ పూర్తిస్థాయిలో చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షులు అల్లు బాబూరావు, కార్యదర్శి నాగోతు అప్పలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ అప్పలసూరి, నాయకులు కొండపు ఈశ్వరరావు, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు రమణ

చర్చిల్లో కొత్త సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-పద్మనాభం

మండలంలోని పలు గ్రామాలలోని చర్చిలలోని కొత్త సంవత్సర వేడుకలు నిర్వహణకు పాస్టర్లు అన్ని ఏర్పాటు సిద్ధంగా ఉంచారు. ఈ సందర్భంగా చర్చిలకు విద్యుత్ అలంకరణలు ఏర్పాటు చేశారు. పద్మనాభం కృష్ణాపురం, మద్ది, విలాస్‌ఖాన్‌పాలెం, పాండ్రంగి, కోరాడ, ఐనాడ, బి తాళ్లవలస, తునివలస, చిన్నాపురం, రెడ్డిపల్లి, పొట్నూరు, అనంతవరం, కోవ్వాడ, పెంట, గందవరం గ్రామాలలోని ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



సరస్‌లో నృత్య ప్రదర్శనలిస్తున్న బాలికలు

సాంస్కృతిక నృత్య హేళ

విశాఖపట్నం : ఆంధ్ర విశ్వ విద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్ 2017)కు విశేష ఆదరణ లభిస్తోంది. ఆదివారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు విచ్చేశారు. దేశం నలుమూలల నుంచి హాజరైన స్వయం సహాయక బృందాల సభ్యులు వస్త్ర, ఉత్పత్తులు ప్రదర్శన విక్రయాలు జోరందుకున్నాయి. జనవరి 3వ తేదీతో సరస్ డాక్రా బజార్ ముగియనుండటంతో పెద్ద సంఖ్యలో నగర వాసులు సందర్శిస్తున్నారు. వస్త్రాలు, ఆహార పదార్థాలు, హస్తకళా వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. సాయంత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళావేదికపై ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద, పాశ్చాత్య నృత్యాలు ఆహూతులను అలరించాయి. అఖిల భారత డ్వాక్రా బజార్‌ను హాస్యనటుడు గౌతంరాజు సందర్శించారు.